# బైబిలుయొక్క
# 66 పుస్తకముల
# సంక్షిప్త సమీక్ష

www.doctorpaul.org

# ఆదికాండము

ఆదికాండము క్రీస్తును సృష్టికర్తగా చూపును. దేవుని వాక్య ప్రత్యక్షతలకు ఆదికాండము నారుమడి. దీని గ్రంథకర్త మోషే. సృష్టి వృత్తాంతమును మోషే సీనాయి పర్వతముపై పొందెను. (అపొ.కా. 7:38). ఇది అన్నిటి ఆరంభములను కల్గిన గ్రంథము. భూమి, పశుపక్ష, వృక్ష జలచరాదులు, సూర్యచంద్ర నక్షత్రాదులు, మానవుడు–మానవ పాపము, మానవ కుటుంబము, మానవ నాగరికత, మానవ భాషలు, హెబ్రీయుల జాతి మొదలగు వీటన్నిటి ప్రారంభమిక్కడే. క్రొత్త నిబంధనయొక్క పునాది ఆదికాండములోనే వేయబడెను. ఇందలి 60 రిఫరెన్సులు క్రొత్త నిబంధనలోని 17 పుస్తకాలలో కనబడును. ఆదికాండము 7 గురు ప్రముఖ పురుషులచుట్టు పరిభ్రమించు చున్నది. వారు ఆదాము, హనోకు, నోవహు, అబ్రాహాము, ఇస్సాకు, యాకోబు, యోసేపులు. వీరు క్రీస్తును ప్రతిబింబించు సప్తపటములు. ఒక్కొక్కరి జీవితములలోని పాఠములీలాగున్నవి. మానవ వైఫల్యము దేవుని రక్షణతో సరిచేయబడును.

**ఆదాము** : మరణము, జీవము. ఇతడు పడిపోయిన మానవ జాతికి శిరస్సు. క్రీస్తు తిరిగి జన్మించిన నూతన సృష్టికి శిరస్సు.

**హనోకు** : నడక, రూపాంతరము.

**నోవహు** : విశ్వాసముతో కూడిన క్రియ–రక్షణ.

**అబ్రాహాము** : విశ్వాసము–ప్రత్యేకింపబడిన జీవితము. అతడు కట్టిన బలిపీఠము విశ్వాసమునకు, వేసిన గుడారము ప్రతేకింపబడిన యాత్రా జీవితమునకు ఋజువులు.

**ఇస్సాకు** : విధేయత; తండ్రి ఆస్తికి ఏకైక వారసుడు.

**యాకోబు** : క్రమశిక్షణనొంది అవసానదశలో మంచి ఆరాధికుడాయెను.

**యోసేపు** : ప్రభువైన యేసుకు ప్రకాశవంతమైన పటము. తండ్రిచేత ప్రేమింప బడుటలోను, సహోదరులచే అమ్మబడుటలోను, గోతిలో త్రోయ బడుటలోను, శ్రమనొంది సింహాసనము నధిష్టించుటలోను ఇతడు మన పరమ యోసేపు (ప్రభువైన యేసు) తో పోల్చదగినవాడు.

www.doctorpaul.org

# నిర్గమకాండము

నిర్గమము అనగా బయటికి పోవుట. మోషే దీని రచయిత. విడుదల మూల పదము. విడుదల రక్తముద్వారానే సాధ్యము. కావున ద్వితీయకాండము యేసుక్రీస్తును పస్కా గొర్రెపిల్లగా చూపును. మానవ విమోచన జగత్తు పునాదికి ముందే ఆలోచింప బడెను. దాని ప్రణాళిక నిర్గమకాండములో గీయబడినట్లుండెను. ఐగుప్తు వెట్టిచాకిరిలో మ్రగ్గు ఇశ్రాయేలు పెట్టిన మొర పరలోకములో చేరగా విమోచన కొరకు కృప దిగి వచ్చెను. 12 అధ్యాయములో పస్కా గొర్రెపిల్ల రక్తము ద్వారా బంధములపై ప్రోక్షింప బడగా తీర్పు తీర్చే దేవుడారక్తమును చూచి దాటిపోయెను. విమోచనలో ఇది మొదటి మెట్టు. రెండవదిగా దేవుడు తన బాహుబలముతో (శక్తి : Power) ఎఱ్ఱసముద్రమును పాయలుగాచేసి, ఆరిన నేలపై ఇశ్రాయేలును ఆవలికిచేర్చి ఐగుప్తీయులను ముంచి చంపెను. ఇది రెండవ మెట్టు. కావున సంపూర్ణ విమోచనలోని భూమికలు, రక్తము, శక్తి.

నిర్గమకాండముయొక్క రెండవ భాగము 19 అధ్యాయముతో ప్రారంభ మగును. ఇందు ధర్మశాస్త్రము, ప్రత్యక్ష గుడారపు నిర్మాణము, యాజకత్వము మొదలగునవి ముఖ్య ఘటములు. విమోచనానంతరమే ఆరాధన యాజకత్మము సాధ్యము. పస్కా గొర్రెపిల్ల, మన్నా బండ, ప్రత్యక్ష గుడారము – ఇవన్నియు క్రీస్తుకు రమ్యమైన పటములు. నిర్గమకాండము చీకటితో ప్రారంభమై మహిమతో ముగియుచున్నది. ఇందలి దేవుని వీరుడు మోషే. బైబిలు వ్రాతలలో యేడవ భాగము మోషే చరిత్రయే.

యేసు – నరునివలె పుట్టి, దాసుని స్వరూపమును ధరించుకొని, సాతాను బంధకము నుండి (మనలను) విడిపించి రక్షించుటకుగాను తన్నుతానే రిక్తునిగా చేసికొనెను. (ఫిలిప్పీ. 2:7). యేసుక్రీస్తు నిన్న, నేడు మరియు యుగయుగములకు ఒక్కటేరీతిగా ఉన్నాడు, ఉండును. (హెబ్రీ. 13:8).

# లేవీయకాండము

గ్రంథకర్త : మోషే, ముఖ్యాంశము : ప్రాయశ్చిత్తము, మూలపదము : పరిశుద్ధత. 'పరిశుద్ధ' అను పదము 87 సార్లును, 'ప్రాయశ్చిత్తము' అను పదము

www.doctorpaul.org

45 సార్లు వచ్చును. పరిశుద్ధాత్ముడు ఈ గ్రంథములో యేసుక్రీస్తును పాపపరిహారార్ధ బలిగా చూపించెను. ప్రధాన సందేశము : విమోచింపబడినవారు రక్తముద్వారా మాత్రమే దేవుని పరిశుద్ధ సన్నిధిలో (స్థలములో) ప్రవేశింపగలరు. విమోచింపబడిన వారు పరిశుద్ధులుగా ఉండి తీరవలెను. నేను పరిశుద్ధుడనైయున్నాను గనుక మీరును పరిశుద్ధులై యుండుడని 5 సార్లు దేవుడు తన ప్రజలను కోరెను. (11:44, 45, 19:2; 20:7, 26). యాజకుడు, బలి, రక్తము, అర్పణ అను మాటలు గ్రంథములో పదేపదే కానవచ్చును. ఇందు 5 అర్పణములు గలవు. దహనబలి, నైవేద్యబలి, సమాధానబలి, పాపపరిహారార్ధబలి, అపరాధపరిహారార్ధబలి యివన్నియు క్రీస్తుయొక్క ఒకే బలిలోని ఆయా విలువలను సూచించుచున్నవి. దహనబలి దేవునికింపైన సువాసనగల హోమము. క్రీస్తుబలి పరిశుద్ధుడైన దేవుని కోపమును పూర్తిగా చల్లార్చి శాంతింపజేయును. దహనబలి క్రీస్తు మరణమును, నైవేద్యబలి అందలి సన్నని పిండి క్రీస్తు పరిమళ జీవితమును, సమాధానబలి క్రీస్తు రక్తమును, పాపపరిహారార్ధబలి క్రీస్తు సిలువను చూపును. దేవుని సన్నిధికి మనము పాపమును తీసికొనిరాగా క్రీస్తు బలిని తెచ్చును.

ప్రధాన యాజకుడైన అహరోను ప్రభువైన యేసుకు, అతని కుమారులు విశ్వాసులమైన మనకును ముంగుర్తు. క్రీస్తు తన రక్తముతో మనలను ప్రతిష్టించి మనలను దేవునికి పరిశుద్ధ యాజకులుగను, రాజరికపు యాజకులుగను చేసెను. పరిశుద్ధ యాజకుడు 'లోనికి' వెళ్లి ఆత్మీయబలి (ఆరాధన) నర్పించును. రాజ యాజకుడు 'బయటికి' వెళ్లి ప్రజల కాశీర్వాదకరమైన సువార్తను ప్రకటించును. ఆదికాండములో మానవుడు పడిపోయెను. నిర్గమకాండములో విమోచింపబడెను. లేవీయకాండములో ఆరాధించుచుండెను.

# సంఖ్యాకాండము

గ్రంథకర్త : మోషే. దీని హెబ్రీ నామము "అరణ్యములో" గనుక దీనిని అరణ్యకాండమనవచ్చును. ప్రభువైన యేసు "పైకెత్తబడినవాడు"గా యిందు చూపించ బడెను. సంఖ్యాకాండములో ప్రజలు పరీక్షింపబడిరి. రక్షింపబడిన హృదయము అవిశ్వాసమును కనిపెట్టి విసర్జింపవలెను. ఇందలి ముఖ్యమైన మూడుమాటలు : సేవ, సమరము, సాగిపోవుట. రక్షిపబడినది సేవించుటకే. అరణ్యములో దాదాపు

www.doctorpaul.org

ముప్పది లక్షలమందికి ఆహారమెట్లు? అక్కడ దేవుడుండెను, నీటినిచ్చే బండ వెంబడించెను, వారి వస్త్రముల, పాదరక్షల జాగ్రత్త దేవుడే వహించెను.

ఇశ్రాయేలీయులు రెండుసార్లు లెక్కింపబడిరి. (1, 26 అధ్యాయములు). ఇశ్రాయేలీయులలో ప్రతివాని స్థానము, విధియు దేవునిచేతనే నిర్ణయించబడెను. ప్రతివాడు తన స్థానములో నిలిచి తన కర్తవ్యమును నిర్వర్తించుకొనుచు జయోత్సాహ ముతో అరణ్యయాత్రలో సాగిపోయి ఉండవలసినది. ఎందుకనగా విమోచింపబడిన అనుభవము, ధర్మశాస్త్రము, ప్రత్యక్షగుడారము, అనుదినాహారము, అగ్నిమేఘ స్తంభ ములు కలిగిన వారికింకేమి కొరత? ప్రజల వైఫల్యము, అవిశ్వాసము దట్టమైన చీకటి వలెనున్నను యెహోషువా, కాలేబులు విశ్వాసహృదయమునకు ఊరటకల్గించు రెండు కాంతివంతమైన పాత్రలు, వీరిరువురు అచంచల విశ్వాసముతో దేవుని నమ్మ కత్వము నందు ఆనందించి గురిచూచి దరిజేరిన విశ్వాసులకు చక్కని మాదిరులు.

# ద్వితీయోపదేశకాండము

గ్రంథకర్త : మోషే. యొర్దాను యివతల పాలస్తీనా యెదురుగా మోయాబు మైదానములో మోషే మృతినొందుటకు కొంచెము ముందుగా వీడ్కోలు సందేశము వలే ధర్మశాస్త్రమును రెండవసారి ఉపదేశించుట ఇందలి విషయ సంగ్రహము. పూజనీయుడైన మన ప్రభువైన యేసుకు ఇది ప్రత్యేక ఇష్టగ్రంథమా యన్నట్లు దీని నుండి ఎన్నో వాక్యములను ఎత్తిచూపెను. క్రొత్తనిబంధనలో 80 సార్లు ఇందలి వాక్యములుదహరింపబడెను. ఈ గ్రంథములో క్రీస్తు ప్రభువు మన నిజమైన ప్రవక్తగా (18:16) చూడగలము. విధేయతకు ఆశీర్వాదమును, అవిధేయతకు శాపమును నిర్దేశించబడెను. ఇశ్రాయేలీయులకు దీర్ఘాయువు, వాగ్దాన దేశమును స్వతంత్రించు కొనుట, శత్రువులపై విజయము, అభివృద్ధి మున్నగునవన్నియు విధేయత ద్వారానే సముపార్జితము. పిస్గానగమునుండి మోషే దేవుని కన్నులద్వారా మాత్రమే పాలస్తీనా దేశమంతటిని చూడగల్గెను. నిర్గమ 15 లో విమోచన ప్రారంభ కీర్తన ఉండినట్లు ద్వితీ 32లో విమోచన ముగింపు కీర్తనగలదు. 33 లో ఇశ్రాయేలీయులను దీవించిన తుది ఆశీర్వాదపు పలుకులు గలవు. 34 లో దైవజనుడైన మోషే మృతినొందగా దేవుడే పాతిపెట్టి సమాధిని దాచియుంచెను. ఇశ్రాయేలీయుల చరిత్ర పునర్విమర్శ చేయబడినట్టుగా దేవుని ప్రజల జీవితము

www.doctorpaul.org

క్రీస్తు న్యాయపీఠముయెదుట విమర్శలోనికి తేబడును గనుక వాక్యపు వెలుగులో దేవుని మనస్సు నెరిగి విధేయతతో జీవించవలె నన్నది ఇందలి ముఖ్య పాఠము. దేవుడేలాగు తన ప్రజల ఆశీర్వాదము కోరెనో అట్లే దేవుని ప్రజలు ఆయన మహిమను కోరువారై యుండవలెను.

# యెహోషువ

గ్రంథకర్త : యెహోషువ. రచనాకాలము క్రీ. పూ. 15 వ శతాబ్ధి. ఇందు యేసుక్రీస్తు ప్రభువు మన రక్షణకర్తగాను దాని కొనసాగించువాడుగాను చూపబడెను. ఇచ్చువాడు దేవుడేగాని పోరాడి స్వతంత్రించుకొనవలసినది మనమే. ఈ గంభీర సత్యము 1:11 లోనే చెప్పబడెను. "మీరు స్వాధీనపరచుకొనుటకు మీ దేవుడైన యెహోవా మీకిచ్చుచున్న దేశము." అబ్రాహాముకు చేసిన వాగ్దాన నెరవేర్పు ఇక్కడ జరిగెను. ఆది. 12:1–3. యెహోషువ నాయకత్వమున ఇశ్రాయేలీయులు పోరాడి జయించి కానానును స్వాధీనపరచుకొని దాని ననుభవించవలెను. కానాను పరలోక మునకు సాదృశ్యమని అనేకులు తలంచెదరు. కాని పరలోకములో అడుగిడిన పిమ్మట పోరాటముండదే !

మోషే ప్రారంభించిన దానిని యెహోషువ పూర్తికాంవించెను. ధర్మశాస్త్రము గురిపెట్టిన దానిని యేసుప్రభువు సాధించెను. యేసు అను గ్రీకు నామమునకు, యెహోషువ అను హెబ్రీ నామమునకు ఒకటే అర్థము: యెహోవా రక్షణ లేక యెహోవా రక్షించును. ప్రధానాంశములు :

1. దేవుని విశ్వాస్యత – ఆయన వాగ్దానము చేసినది తప్పక నెరవేర్చును.

2. ఇందలి యుద్ధములు ఆత్మ జరిగించు పోరాటములు. కనానీయులు మన శరీరేచ్ఛలే.

3. ఇంతవరకు దేవుడు దర్శనములద్వారా, కలలద్వారా, దేవదూతలద్వారా మాట్లాడెను. ఇక్కడనుండి యెహోషువతో దేవుడు ధర్మశాస్త్రముద్వారా (లిఖిత వాక్యము) మాట్లాడనారంభించెను. నేటికి ఇదే సూత్రము సరియైనది. ఇశ్రాయేలీయులు కనానును స్వతంత్రించుకొనగోరినచో యొర్దాను దాటవలెను. యొర్దాను క్రీస్తు మరణ పునరుత్థానములకు సాదృశ్యము. యెహోషువకు సమరూప గ్రంథము ఎఫెసీ పత్రిక. యెహోషువ "మనయందున్న క్రీస్తు"కు సూచన. పోరాటములో నడిపించి విశ్వాసికి జయమనుగ్రహించునది క్రీస్తే.

www.doctorpaul.org

# న్యాయాధిపతులు

గ్రంథకర్త ఎవరో ఖచ్చితముగా తెలియదు. కాని ఇశ్రాయేలీయులకు రాజులేడని 4సార్లు వ్రాయబడుటనుబట్టి రాజు నేర్పరచిన తరువాత సమూయేలు వ్రాసియుండవచ్చని పలువురి భావన. 14 గురు పురుషులు ఒక స్త్రీయు న్యాయాధిపతులుగా 350 సంవత్సరములు (క్రీ.పూ. 14 నుండి 11 వరకు గల శతాబ్దములలో) ఏలిరి. ప్రభువైన యేసు విమోచకుడు - న్యాయాధిపతియని గిద్యోను, సమ్సోనువంటి పటములద్వారా చూపబడెను. భ్రష్టత్వము, బానిసత్వము, చీకటి పరిస్థితులు గ్రంథమంతయు అలముకొన్నవి. విజయము, సంతోషములతో విలసిల్లిన యెహోషువ తర్వాత ఇట్లుండుట విచారకరము. 7 సార్లు భ్రష్టులై 7 సార్లు దాసత్వములోనికి వెళ్లగా 7 సార్లు దేవుడు మొఱవిని 7 సార్లు విజయమనుగ్రహించి విడిపించుటద్వారా మనుష్యుని పూర్తి పతనమునకు దేవుని కృప చాలినంతగలదని చూపుచున్నది. ప్రజలు దేవుని విడిచి పెట్టగా (2:13) దేవుడు ప్రజలను విడిచిపెట్టెను (2:23). దేవుడు కానానును పూర్తిగా స్వాధీనపరచుకొమ్మని చెప్పగా ఇశ్రాయేలీయులు మానవ రీతిగా తలంచి కనానీయులను పూర్తిగా వెళ్లగొట్టక ఉండనిచ్చిన కారణమున వారే వీరిని అనేక మార్లు అణచివేసిరి. అట్లే విశ్వాసులమైన మనలను అసంఖ్యాకమైన పరలోకపు ఆశీర్వాదములను స్వతంత్రించుకొమ్మని దేవుడు కోరినను అవిధేయత, అవిశ్వాసముల కారణముగా కొద్దిపాటి ఆశీర్వాదములను మాత్రమే పొంది, స్వల్ప సంతోషముతో యుంటిమి గనుక అనేకసార్లు క్రైస్తవ జీవితములో ఓటమి, కరువు, కన్నీరు చవిచూచుచున్నాము. తాను కోరుకొనిన తన ప్రజలు పరిశుద్ధముగా నుండవలెను గనుక పొరుగు జనాంగములతో మిళితము కాకూడదనియు, పాపముతోను దుర్నీతితోను పోరాడవలసినదని చెప్పుచున్నాడు, ప్రత్యేకతలో పరిశుద్ధమైన భక్తికి కావలసిన బలమున్నదని ప్రభువెరుగును.

# రూతు గ్రంథము

గ్రంథకర్త ఎవరో తెలియదు. కాని దావీదు రాజైన తరువాత సమూయేలు వ్రాసియుండవచ్చని కొందరి అభిప్రాయము. క్రీ. పూ. 11 వ శతాబ్ది చివరి

www.doctorpaul.org

భాగములో వ్రాయబడెను. క్రీస్తుప్రభువు సమీపజ్ఞాతి–విమోచకుడుగా బోయజునందు ఒక పటముగా చూపబడెను. విమోచనద్వారానే విశ్రాంతి – ముఖ్య పాఠము. రూతు తన అత్తతో చెప్పిన మాటలు అసలు మానవ సాహిత్యములో ఎక్కడా కనపడవని పండితుల నిర్థారణ. న్యాయాధిపతుల గ్రంథము చదువుచుండగా ఎడారిలో ప్రయాణించుచుండి నట్లగపడునుగాని రూతు గ్రంథము వెంటనే నీటి బుగ్గవలె ఆహ్లాదము కలిగించును. ప్రభువైన యేసుయొక్క వంశావళి స్థిరపరచుటకు దావీదు పితరులను పేర్కొనుట మరియొక ముఖ్యాంశము. రూతు అనగా సంతృప్తి లేక సౌందర్యము అని అర్థము వచ్చును. ఈమె మోయాబీయురాలు. ధర్మశాస్త్రము వీరిని దేవుని ప్రజలలో చేరకుండ నిషేధించెను. అయితే కృప ప్రవేశమిచ్చెను. రూతు అన్యులలోనుండి ప్రభువుకొరకేర్పడిన సమాజమునకు ముంగుర్తు. బోయజు విడుదల ఇశ్రాయేలుకు, సమాజమునకు చెందినది. రూతు విమోచింపబడి బోయజుతో చేర్చబడిన తరువాతనే ఎట్లు విశ్రాంతి పొందెనో అట్లే సంఘముకూడా మన పరమ బోయజుతో చేర్చబడిన తరువాతనే విశ్రాంతి పొందును. బోయజు అనగా – అతనియందు బలము కలదు అని అర్థము. మిగుల ఆస్థిపరుడు. నయోమికి చుట్టము. విడిపించ ఆశకలిగినవాడు. కావున బోయజులోని ఈ సుగుణములు, అర్హతలు ప్రభువైన యేసును “విడిపించగల వారసుడు–విమోచకుడు” అని తేటగా పేర్కొను చున్నవి.

# మొదటి సమూయేలు గ్రంథము

గ్రంథకర్త ఎవరో తెలియదు. కాని సమూయేలు, నాతాను, గాదు అను ముగ్గురు వ్రాసియుండవచ్చని పండితుల భావన. (1 దిన. 29:29). ప్రధాన అంశము– సరియైన రాజు ప్రభువైన యేసు. సమూయేలు, సౌలు, దావీదు అను ముగ్గురి చరిత్రల పొత్తము. సమూయేలు అనగా “దేవుని అడిగితిని” అని అర్థము. చూడండి హన్నా దేవుని అడుగగా సమూయేలును, ప్రజలు లోకానుసారులై అడుగగా సౌలును, సమూయేలు భారముతో అడుగగా దావీదును దేవుడే ఇచ్చెను. కావున ప్రార్థన ఈ గ్రంథమునకు మూలపదము. ప్రార్థనద్వారా జన్మించిన సమూయేలు గొప్ప ప్రార్థనా పరుడు. దావీదు క్రీస్తుకు చక్కని మాదిరి. దేవుడు సౌలును విసర్జించి దావీదును రాజుగా అభిషేకించినను సౌలు దావీదును చంపతరిమెను. అనేక శ్రమలు

www.doctorpaul.org

పెట్టెను. క్రీస్తు దేవుడభిషేకించిన రాజు. అయితే లోకముచే ద్వేషించబడి, తరుమబడి, సిలువ వేయబడెను. సౌలు దావీదును ద్వేషించినా దావీదు మాత్రము సౌలును ప్రేమించెను. లోకము క్రీస్తును ద్వేషించినా క్రీస్తు మాత్రము లోకముయొక్క ఆశీర్వాదమును కోరెను. బైబిలులో 281 పర్యాయములు కనబడు “సైన్యముల కధిపతియైన యెహోవా” అను పేరు ఇక్కడే ఆరంభమైనది. (1:3). మెస్సీయ (క్రీస్తు, అభిషిక్తుడు) అను పేరు ఆరంభము ఇక్కడే. (11:10). ప్రవక్తకు దీర్ఘదర్శియను చక్కని నామంతరమును ఇందే చూచెదము. యాజకత్వము విఫలముకాగా దేవుడు ప్రవక్తలను లేపెను. ప్రవక్తలలో సమూయేలు మొదటివాడు. ప్రవక్త ఆశీర్వాదము కొరకు నిరంతరము ప్రార్థించును. ప్రజలకొరకు ప్రార్థించనిచో తనకు పాపము కలుగునని భయపడిన దేవుని ప్రవక్త సమూయేలు. విజ్ఞాపనలో క్రీస్తుకు సమూయేలు తగిన సాదృశ్యము. కావున ఈ గ్రంథమునకు సమూయేలని పేరు పెట్టుట సముచితమే.

# రెండవ సమూయేలు గ్రంథము

గ్రంథకర్త ఎవరో ఖచ్చితముగా తెలియదు. నాతాను, గాదు అనువారు దావీదు సమకాలీనులగు రచయితలు గాన వీరే వ్రాసియుండెదరని చాలామంది నమ్ముచున్నారు. (1 దిన. 29:29). మొదటి సమూయేలులో మనుష్యుల రాజు సౌలు పతనమును చూచెదము కాని యిందులో దేవునిరాజు దావీదుయొక్క ఘనవిజయములను చూచెదము. 11 అధ్యాయములోని వృత్తాంతము దేవుని హృదయానుసారుని జీవితము తెల్లని తెరపై మాయనిమచ్చ. క్రీస్తు మనకు రాజైయుండుట మాత్రమేగాక మన హృదయ సింహాసనము నధిష్టించి సమస్తమును ఏలువాడై యుండవలెనన్నది ముఖ్యాంశము. స్వజీవితములో ఓడినను ప్రభువునుగూర్చిన పనులలో దావీదు ఎన్నడు ఓడినవాడు కాడు. తన రాజ్యములో రవ్వంతకూడ విగ్రహారాధన లేకుండ చేసిన ఘనుడితడే. ఇతని రాజ్యములో న్యాయము, జ్ఞానము, యథార్థత, ధైర్యము, కనికరము మెండుగ నెలకొనిన కారణమున రాబోవు రారాజుకితడు రమ్యమైన సాదృశ్యము. దావీదు కన్న కుమారుడు అబ్షాలోము దావీదుకు ప్రధాన శత్రువుగా నుండుట ‘క్రీస్తువిరోధి’కి సాదృశ్యముగానున్నది. కావున యౌవనదశలో విషాదమరణమొందెను.

www.doctorpaul.org

దేవుని ఎంతగా సేవించినను పాపమును ఉపేక్షించక దావీదు పాపమును అతడి ఒడిలోనే వేసిన పరిశుద్ధుడైన దేవుని న్యాయపాలన ప్రత్యేకముగా గమనింప దగిన పాఠము. “నీ యింటివారికి సదాకాలము యుద్ధము కలుగును. నీ యింటివారి మూలముననే నేను నీకు అపాయము పుట్టింతును. నీవు చూచుచుండగా నీ భార్యలను తీసి నీ చేరువ వాని కప్పగించెదను”. విశ్వాసీ, హెచ్చరిక తీసికో: నీ సేవ ఎంత గొప్పదైనను పరిశుద్ధుడైన దేవుడు నీలోని పాపము ఏ కొంచెమైనను చర్యగైకొనక మానడు. లేనిచో ఆయన నీతిమంతుడైన రాజుగా ఉండజాలడు.

# మొదటి, రెండవ రాజులు గ్రంథములు

గ్రంథకర్త ఎవరో తెలియదు. రచనా తీరును బట్టి యిర్మీయా వ్రాసెనని యూదుల నమ్మిక. సొలొమోను పరిపాలన ప్రభువైన యేసుయొక్క వెయ్యేండ్ల పాలనకు మాదిరి. హెబ్రీ భాషలో మొదటి, రెండవ రాజులు ఒకే గ్రంథము. గ్రీకు లోనికి 70 మంది తర్జుమా చేసినప్పుడు సమూయేలు, రాజులు, దినవృత్తాంత ములను రెండేసి గ్రంథములుగా విడగొట్టిరి. రాజులు గ్రంథము ప్రభువైన యేసును రాజుగా చిత్రించుచున్నది. సొలొమోను మహిమాయుక్త వైభవ పాలన ఇశ్రాయేలు చరిత్రలో స్వర్ణయుగము. అయితే సొలొమోను పాపము రాజ్యము చీలిపోవుటకు మూలకారణము. రెండవ ప్రధాన వ్యక్తి ప్రవక్తయైన ఏలీయా. ఇతడు బాప్తిస్మమిచ్చు యోహానుకు పటము. ఇతని సూచక క్రియలు, ప్రవక్త పదవి ప్రభువైన యేసుకు పోలినవిగా యుండెను. సొలొమోను మొదలు యెహోషాపాతు (యూదా) అహజ్యా (ఇశ్రాయేలు)ల వరకుగల రాజుల జీవితములు తెలియజేయు ఆత్మీయ పాఠము : ప్రభువైన దేవుని యెడల నమ్మకముగా విధేయులై యుండినచో రాజ్యమునకు ప్రజలకు క్షేమమును, అవిధేయులై ఆత్మీయ భ్రష్టత్వమునకు కారకులైనచో తీర్పులద్వారా దేవుని శిక్షయు కలుగును. “తన పితరుడైన దావీదువలే” నుండుటలో రాజులందరు తప్పిపోయినట్లు కనుగొనెదము. ప్రభువు నామము అక్కడ వుందునట్లు యెరూషలేములో సొలోమోను మందిరమును నిర్మించెను. అదిగాక మరియొక మందిరమును దేవుడు ఆమోదించడు. సొలొమోను మొదట ఆత్మాను సారముగా ఆరంభించి తుదకు శరీరాను సారముగా చాలించిన విశ్వాసి(కి ముంగుర్తు). “సొలొమోను హృదయము దేవుడైన యెహోవా యెడల యథార్థము కాకపోయెను”.

www.doctorpaul.org

భయంకర పతనము. దేవుడు హృదయము చూచును. రాజ్య వైభవము గంభీరమేగాని రాజు అంతరంగము దేవునికి దూరము. క్రైస్తవ సంఘ చరిత్రలో మత నాయకుల స్థితి యిట్లే ఉండును. అయితే ప్రభువుకు స్తోత్రము. జీవముగల దేవునితో నిండి మండుచున్న హృదయులైన ఏలీయాయు మానవ నేత్రమునకు మరుగైన మరి ఏడువేల నమ్మకమైన సాక్షులును దేవుని పక్షమున నుండిరి.

# మొదటి దినవృత్తాంతములు గ్రంథము

గ్రంథకర్త ఎవరో రూఢిగా తెలియదు. యూదుల నమ్మిక చొప్పున శాస్త్రియైన ఎజ్రా వ్రాసియుండెననుటకు తార్కాణములు గలవు. దీని శైలి ఎజ్రా గ్రంథశైలి వలెనే ఉండును. క్రీ. పూ. 450- 430 సం॥ల కాలములో ఎజ్రా దీనిని పూర్తిచేసెననుటకు ఆధారములు గలవు. మొదటి తొమ్మిది అధ్యాయములలోని వంశావళులు మత్తయి సువార్త మొదటి అధ్యాయములోని వంశావళులకు మూలము. రెండవ సమూయేలు 7 లోను మొదటి దినవృత్తాంతములు 7 లోను దావీదు సింహాసనము అతని సంతతికి శాశ్వతముగా వాగ్దానము చేయబడెను. సొలొమోను ఆ వాగ్దానమును కొంచెమే నెరవేర్చెను. పూర్తి నెరవేర్పు క్రీస్తుద్వారా జరుగును. దేవాలయము అందలి యాజకత్వ పరిచర్యలు ముఖ్యముగా దృష్టి యందుంచుకొని సంఘటనలు వ్రాయబడెను.

దేవుని హృదయానుసారుడైన దావీదు విషయములో కృపాయేర్పాటు ఎట్లు సంపూర్ణత చెందెనో తెలియును. అవిధేయుడైన సౌలు పాలన అసలు ప్రసక్తికే రాలేదు. అతని విదారక మరణ వృత్తాంతము మాత్రమే పేర్కొనబడెను. సౌలు శరీరసంబంధియైన మనుష్యునికి సాదృశ్యము. దేవుని మహిమ మాత్రమే గురిగాగల దావీదు క్రీస్తుకు ముంగుర్తు. అందుచేత దావీదుయొక్క చీకటి ఘడియల ప్రస్తావనే యిందు వ్రాయబడలేదు. మానవ పతనములతో నిమిత్తములేని కృపమహదైశ్వర్యము యొక్క వడిగల ప్రవాహములో దావీదుయొక్క పాపము, అమ్నోను పాపము, అబ్షాలోము తిరుగుబాటు – విషాదమరణము, మున్నగు చీకటి మరకలన్నియు తుడుచుకొని పోయెను. పైగా మందిర నిర్మాణముకొరకు తాను సమకూర్చిన సామాగ్రి సొలొమోనుకొరకై యోచించిన మోచనలు గణనీయముగా పేర్కొనబడుటచే దావీదు కృపామహిమకు పాత్రుడైనట్లు వ్రాయబడెను.

www.doctorpaul.org

# రెండవ దినవృత్తాంతములు గ్రంథము

రెండవ సమూయేలు, రాజులు రెండు గ్రంథములు ఇశ్రాయేలీయుల రాజకీయ చరిత్రను తెలుపుచుండగా దినవృత్తాంతములు వారి ఆత్మీయ చరిత్రను (మతపరమైన చరిత్ర) తెలుపును.

ముఖ్యాంశము : దేవుని వెదకుట. దేవుని వెదకినప్పుడే ఆశీర్వాదము, జయము, జీవిత సాఫల్యత లభించును. దేవుని వెదకుట అనుమాటలోనమ్ముట, విధేయత చూపుట, ఆధారపడుట, ప్రేమించుట, ప్రార్థించుట మున్నగు హృదయ వైఖరులు యిమిడియున్నవి. ఈ గ్రంథములో దేవాలయము, అందలి ఆరాధన ప్రముఖ పాత్ర వహించెను. ఇది సొలొమోను మందిరమహిమతో ఆరంభమై పునర్నిర్మాణము నిమిత్తము కోరహు యిచ్చిన ఆజ్ఞతో ముగిసెను. ఇందు 5 ఉజ్జీవములును వాటికి కారకులైన ఆసా, యెహోషాపాతు, యోవాషు, హిజ్కియా, యోషీయాల చరిత్రలును ప్రముఖపాత్ర వహించెను. సొలొమోను వైభవోపేత రాజ్యపాలన క్రీస్తు ప్రభువుయొక్క వెయ్యేండ్ల పాలనకు ఛాయాపటము. రాజులు గ్రంథములలో మానవమాత్రులైన రాజులయొక్క పతనములు లిఖింపబడెనుగాని దినవృత్తాంతములలో ఆ పతనములన్నింటిని అధిగమించు దేవునికృప రారాజు జన్మించనైయున్న దావీదు వంశమును ఎట్లు నిలువబెట్టెనో వ్రాయబడెను. ఎన్నో హత్యలు, విద్రోహములు, కుట్రలు జరిగినను వంశావళి చెక్కుచెదరలేదు. ప్రార్థనద్వారా దేవునిపై ఆధారపడుట జయజీవితముయొక్క రహస్యమని 1:6; 13:18; 14:26; 15:9; 20:27; 37:6 లలో చూచెదము. తనయెడల యథార్థ హృదయము గలవారిని బలపరచుటకై యెహోవా కనుదృష్టి లోకమందంతటను సంచారము చేయుచున్నది. మనుష్యుడు దేవుని వెదకుటనుగూర్చి ఈ గ్రంథములో 18 సార్లు గలదు. అయితే దేవుడుకూడ తన్ను వెదకువారిని కనుగొనుటకై భూలోకమంతట వెదకుచున్నాడని 16:9 లో చూచుట బహు ధన్యకరము.

# ఎజ్రా

గ్రంథకర్త ఎజ్రా అని వ్రాయబడకపోయినను నిస్సందేహముగా ఆయనే. ఎజ్రా దైవభక్తియు, పూర్ణవిశ్వాసమును, యథార్థవర్తనయు, ధర్మశాస్త్రావలంబనముగల

www.doctorpaul.org

నిజమైన శాస్త్రి. ఎజ్రా, నెహెమ్యాలు సమకాలికులు. రెండవ మక్కబీయులు 2:13 ప్రకారము నెహెమ్యా నెలకొల్పిన గ్రంథలయమును బాగుగా వాడుకొన్న వాడు ఎజ్రాయే. నేటి మన ఆరాధనతో సారూప్యతగల సమాజమందిర తరహా ఆరాధనకు రూపకల్పన చేసినవాడుకూడ ఎజ్రాయే. ఎజ్రా గ్రంథములో యూదులు బబులోను నుండి రెండుసార్లు తిరిగి వచ్చినట్లు గలదు. మొదటిసారి ఆలయ పునర్నిర్మాణము నిమిత్తము యెరుబ్బాబెలు నాయకత్వమున వచ్చిరి. రెండవసారి ప్రజల ఆత్మీయస్థితి గతుల పునర్నిర్మాణము నిమిత్తము ఎజ్రా నాయకత్వములో వచ్చిరి. ఈ రెండు రాకలకు మధ్య వ్యవధి అరువదియేండ్లు. ఈ మధ్యకాలములో ఎస్తేరు పర్షియా రాణిగా భాసిల్లెను.

ఎజ్రా అనగా సహాయము అని భావము. ఎజ్రా గ్రంథములోని మూల పదము యెహోవా వాక్యము. క్రీస్తు మనలను తిరిగి సమకూర్చువానిగా చిత్రించును. హెబ్రీ భాషలో ఎజ్రా, నెహెమ్యాలు ఒకే గ్రంథముగానుండును. క్రైస్తవారాధనయొక్క నిజ స్వరూపమునకు రాగోరినచో దైవికసూత్రములకొరకు తప్పక చూడవలసిన లేఖన భాగము ఎజ్రా. దేవుని ప్రజల ఆధ్యాత్మిక, రాజకీయ, సాంఘిక జీవితములో దేవుని వాక్యమునకుగల స్థానమునుగూర్చి నొక్కిచెప్పును. ఇశ్రాయేలు, యూదా జనులమధ్య దేవుని వాక్యమునకు సరియైన స్థానము లభించినది ఎజ్రా దినముల లోనే. ఎజ్రా వాక్యమును బోధించగా యూదా జాతీయజీవనములో అద్భుతములు సంభవించెను. బైబిలు ప్రేమికులకు ఎజ్రా చరిత్ర బహు ఇష్టము.

# నెహెమ్యా

ఇది నెహెమ్యా స్వీయ చరిత్ర. పాత నిబంధనలో ఆఖరిగా వ్రాయబడిన చారిత్రాత్మక గ్రంథము. ఇతడు యూదా గోత్రపు రాజవంశములో జన్మించినవాడు. చెరకాలములో జన్మించి యుండవచ్చును. సౌశీల్యవంతుడుగాన ఘనతకెక్కిన అర్తహషస్తకు పానదాయకుడాయెను. షూషనులో సకల భాగ్యభోగములమధ్య తానుండినను హృదయము మాత్రము శథిలమైన పితరుల పట్టణము మీదనే ఉండెను. సకల సౌఖ్యములను విడచి దేవుని పిలుపుకు లోబడి శ్రమ, ప్రమాదము, నిందలతో కూడిన దేవుని పనికై వేగిరపడి దానిలో కృతార్థుడయ్యెను. నెహెమ్యా దైవభక్తియు, దేశభక్తియు, ధైర్యసాహసములును, ప్రార్థనా జీవితమునుగల సంస్కర్త.

www.doctorpaul.org

ఈ గ్రంథము ప్రార్థనతో ఆరంభమై ప్రార్థనతో ముగియును. ఇందలి మూల పదములు: ప్రార్థన, పని. దేవుని పనివాడుగా నెహెమ్యాలో 7 అనుసరింపదగిన సుగుణములు గలవు. అవి (1) దేవుని పట్టణము (సమాజమునకు గుర్తు) ను గురించిన చింత. (2) ప్రార్థన ద్వారా దేవునిపై ఆధారపడుట 1:5. (3) కృత నిశ్చయత 2:17. (4) స్వయమును ఉపేక్షించి శ్రమలను కొనుట 2:17. (5) దేవుని పనికొరకు యితరులను ప్రోత్సహించుట 2:17. (6) శత్రువుల ఎదిరింపులకు జడియక ధీరత్వమును ప్రదర్శించుట 4:14. (7). తన జ్ఞానముతో పనిచేసియు ఘనమును దేవుకే ఆరోపించుట 7:5.

నెహెమ్యా అనగా 'యెహోవా యొక్క ఆదరణ' అని భావము. విశ్వాసపు బలము నెరిగినవాడు. దేవుని ప్రజలను నడిపించుటలో పాలనాదక్షత గలవాడు. యథార్థమైన భక్తి గల్గి కృతనిశ్చయముతో లోకమునుండి ప్రతేకత కొరకు ప్రాకారమును నిర్మించిన నెహెమ్యాయొక్క అడుగు జాడలను గుర్తించి నేడు లోకము యొక్కయు మతము యొక్కయు కాలుష్యమునుండి తన్నుతాను ప్రత్యేకించుకొని ప్రభువు వాడుకొనుటకు అర్హమైన పాత్రగా జేసికొనుట ప్రతి విశ్వాసియొక్క ప్రథమ కర్తవ్యము.

# ఎస్తేరు

గ్రంథకర్త : తెలియదు. కొందరు మొర్దెకై అనియు, కొందరు ఎజ్రా గాని నెహెమ్యా గాని వ్రాసియుండవచ్చునని సూచింతురు. ఎస్తేరు అనగా నక్షత్రము. తూర్పు నక్షత్రము మరియు "దాచబడిన" అని అర్థములు గలవు. ఔను, ఎస్తేరు గుణవతియై నక్షత్రమువలే ప్రకాశించెను. ఔనౌను. దేవుని పేరు కూడ దాచబడెను. ఈ గ్రంథములో దేవుని పేరు కనిపించకపోయినను దేవుని వ్రేలు (హస్తము) తేటగా కన్పించుచున్నది కదా అని బైబిలు వ్యాఖ్యాన కర్తలకు పితామహుడైన మాథ్యూ హెన్రీ సంతసించెను. ఈ గ్రంథము ప్రభువైన యేసు మన ఉత్తరవాదియని చూపించును. దేవుని ప్రజల సంరక్షణార్థమై ఒక ప్రతేకమైన పని నిమిత్తము దేవునిచేత ప్రత్యేకముగా ఎన్నుకొనబడిన యోసేపు వలే ఎస్తేరుకూడ ఎన్నుకొనబడెను.

దేవుని ప్రజలను అంతమొందించుటకై అనగా ఆ ప్రజలలోనుండి రానైయున్న రక్షకుని వంశవళిని నిర్మూలించుటకై ఒక వైపు సాతాను తన పనిముట్టు హామానును

www.doctorpaul.org

హెచ్చించుచుండగా ఆ వంశావళిని చెక్కు చెదరకుండ కాపాడుటకై దేవుడు తన పనిముట్లు మొర్దెకై, ఎస్తేరులనుకూడ హెచ్చించుచుండెను. అంతిమ విజయము దేవునిదే. అన్య జనులమధ్య హెచ్చింపబడిన మొర్దెకై అను యూదుడు ప్రభువైన యేసుకు చక్కని పటము. రాజు ప్రాణమును కాపాడిన మొర్దెకై అమూల్యఆత్మలను రక్షించు క్రీస్తుకు ముంగుర్తు. ఎస్తేరు సౌందర్యమునుచూచి ముగ్ధుడైనట్లు దేవుడు తన ప్రజల ఆత్మీయ సౌందర్యమును చూచి సంతసించును.

ఇశ్రాయేలీయులు అవిధేయులై దేవుని శిక్షాహస్తముచేత తరుమబడి అన్యదేశాలలో చెదరియున్న తరుణములో సయితము కృపామయుని హృదయము వారి పట్ల దయగొని హామాను కుట్రద్వారా నశింపకుండ కాపాడుట దేవుని ప్రతి శిక్షచాటున ప్రేమ దాచబడియుండునని ఎస్తేరు గ్రంథము ఋజువు చేయును.

# యోబు గ్రంథము

బైబిలంతటిలో తొలిగా వ్రాయబడిన గ్రంథము. ఆదికాండము యోబు జీవితకాలాంతరమే వ్రాయబడెను. యోబు అబ్రాహాము సమకాలీనుడు. హెబ్రీభాషలో యోబు అను పేరు అయ్యాబ్ అని ఉండును. దానికి శ్రమనొందినవాడు మరియు శ్రమనాదము అను అర్థములు వచ్చును. గ్రంథకర్త యోబు అని కొందరు, ఎలీహు అని కొందరు, మోషే అని కొందరు, సొలొమోను అని కొందరు భావించుదురు. 32:16 ను బట్టి ఎలీహు వ్రాసెనని నమ్ముటకు వీలున్నది. ఊజుదేశము మోషే 40 సంవత్సరములు నివసించిన మిద్యానును ఆనుకొనియుండెను కనుక ఆ కాలములో మోషేయే వ్రాసియుండవచ్చని పలువురు భావింతురు. అబ్రాహామువలే యోబు కుటుంబ యాజకుడు. మోషే ధర్మశాస్త్రమునుగూర్చిన ప్రసక్తి అసలు లేనందున అది చాలా పురాతన గ్రంథము. ప్రభువైన యేసును విమోచకుడుగాను, మధ్యవర్తిగాను ఈ గ్రంథము చూపించును. మార్టిన్ లూథరు లేఖనములన్నింటిలో సర్వోన్నతమైన స్థానము నాక్రమించినది యోబు గ్రంథమే యని నుడివెను.

భూలోక నివాసులందరిలో నీతిమంతుడైన యోబు భక్తి, శ్రమ కొలిమిలో పరీక్షింపబడి యథార్థమైనదని నిర్ధారింపబడెను. యోబుయొక్క ముగ్గురు స్నేహితులు ఈ శ్రమయంతటికి యోబుయొక్క రహస్య పాపమేదో కారణభూతమైయుండునని తలంచిరి. దేవుడు అనవసరముగా యథార్థవంతులను పాడుచేయడని వారి నమ్మిక.

www.doctorpaul.org

తాను నిర్దోషినని యోబు వాదించుకొనెను. యోబు యథార్థవర్తనుడేగాని అతనిలో నేను నీతిమంతుడను అనెడి స్వనీతినిగూర్చిన అతిశయముండెను. ఎలీహు ఆ ముగ్గురిలో చిన్నవాడైననూ యోబు నిరుత్తరుడగునంతగా దేవుని పక్షమున వాదించెను. ఈ విషయములో ఎలీహు క్రీస్తుకు పటముగానున్నాడు. తుదకు దేవుడు సుడిగాలిలో నుండి యోబుకు ప్రత్యక్షమై మాటలాడెను. దేవుని సన్నిధిలో తన స్వనీతి యోబుకు మురికిగుడ్డవలే కనిపించెను. కాగా నన్ను నేను అసహ్యించుకొనుచున్నాను అని పశ్చాత్తాపపడి రెట్టింపు ఆశీర్వాదమునకు పాత్రుడాయెను.

# కీర్తనలు గ్రంథము

దాదాపు 75 కీర్తనలు దావీదు వ్రాసెను. దావీదుకు కాపరిగా, గాయకునిగా, యోధునిగా, రాజుగా విశేష జీవితానుభవముండెను. 12 కీర్తనలు ప్రధన గాయకుడైన ఆసాపు వ్రాసెను. పది కీర్తనలు కోరహు కుమారులును, సొలొమోను రెండును (72, 127), మోషే ఒకటియు (90), జ్ఞానియైన హేమాను ఒకటియు (88) వ్రాసిరి. మిగిలినవి 49 అజ్ఞాత కీర్తనకారులవి. బైబిలంతటిలో పెద్దదియు, విరివిగా వాడబడునదియు కీర్తనల గ్రంథమే. వ్యక్తిగత జీవితానుభవములు, దేవునితో వ్యక్తిగత సహవాస బాంధవ్యములు, సృష్టి వివరణ, దేవుని ప్రజల అరణ్య యాత్ర, దేవుని అద్భుత కార్యములు, భక్తుల ఆశీర్వాదము, భక్తిహీనుల దుర్గతి, క్రీస్తు విమోచన కార్యము, క్రీస్తు శ్రమలు, మరణము, పునరుత్థానము, మహిమా పాలన మున్నగు మహా గంభీర అంశములు కీర్తనలుగా మలచి గానము చేయబడినవి.

కీర్తనల గ్రంథము క్రీస్తు సర్వములో సర్వమైయున్నాడు అను అంశమును చూపించును. రండి యెహోవానుగూర్చి ఉత్సాహధ్వని చేయుదము, మన రక్షణ దుర్గమునుబట్టి సంతోషగానము చేయుదము (95:1) అనుచు ప్రభువుయొక్క స్తుతి ప్రశంసలను ఉత్సాహధ్వనులతో సంతోషగానములతో కీర్తించిన ఆ కీర్తనకారుల ఆత్మ ప్రేరణ ప్రభావము వేల సంవత్సరాలవరకు ప్రజల హృదయములపై యింకను లోతుగా ముద్రింపబడుతూనే ఉన్నది. ప్రవక్తగాను, యాజకుడుగాను, రాజుగాను క్రీస్తు ప్రభువును గూర్చిన ప్రవచనములతోను, పనుల వివరణలతోను కీర్తనల గ్రంథము నిండియుండుట వలన యూదులకే గాక క్రైస్తవులకుకూడ ఎనలేని అమూల్యమైన సాహిత్య ఖండముగా విరాజిల్లుచున్నది. సుబోధ, స్తుతి, కృతజ్ఞతార్పణ,

www.doctorpaul.org

పశ్చాత్తాపము, అచంచల విశ్వాసము, ప్రవచనము, కృంగుదలలో ఓదార్పు. సృజింపబడిన అల్పజీవికి సృష్టికర్తయే శరణ్యము మున్నగు అనుదిన జీవితాంశములతో సర్వులను సర్వదా ఆదరించు గ్రంథము. సువర్ణ (Golden Gate) ద్వారము కీవల కీర్తనల గ్రంథము లేకుండ నేను సంతోషముగా ఉండగలనా అని C.H. స్పర్జను నుడివెను. ఇందలి మూల పదము : ఆరాధన.

# సామెతలు

కీర్తనలవలే ఇదియు పద్యకావ్యము. దీని మహోన్నత అంశము : యెహోవా యందలి భయము జ్ఞానమునకు మూలము. రాజైన సొలొమోను సమాధాన రాజ్యమును స్థాపించెను. సమాధాన అధిపతియైన క్రీస్తు రాజ్యమునకు ఇది ఛాయ. అందుకే కాబోలు సామెతలు, మత్తయి 5, 6, 7 లోని పరలోక రాజ్యగుణములకు అనుగుణ్యముగానున్నవి. మనస్తత్వశాస్త్రమునకు సామెతల గ్రంథము మూల వాచకము. సామెత ద్వారా ఒక సత్యమును శక్తివంతముగా బోధించవచ్చును. ఈ పద్ధతి పురాతన కాలమునుండి వాడుకలోనున్నది.

మూలపదము : జ్ఞానము (జీవితమును నైపుణ్యముగా జీవించు శక్తి) భక్తిహీనుల మధ్యలో భక్తికల్గి, కలుషితలోకములో మలినమంటకుండ జీవించు మార్గమును సామెతలు జ్ఞానాన్వేషియెదుట నుంచును. హెబ్రీ భాషలో దీనికి సొలొమోను సామెతలని పేరున్నదిగాని రబ్బీలు దీనిని జ్ఞానగ్రంథమని పిలుతురు. మొదటి రాజులు 4:32 లో సొలొమోను 3000 సామెతలు, 1005 కీర్తనలు వ్రాసెనని ఉన్నది. వాటిలో దీనిలోనికి 800 సామెతలు మాత్రమే వచ్చెను. కీర్తనల గ్రంథమువలే దీనికికూడ కర్తలనేకులు; ప్రధాన సంచాలకుడు సొలొమోను.

క్రీస్తే జ్ఞానమని యిందు చిత్రింపబడెను (8వ అధ్యాయము). బుద్ధి జ్ఞానముల సర్వసంపదలు క్రీస్తునందే గుప్తములు (కొలస్స. 2:3). క్రీస్తు దేవుని శక్తియు, దేవుని జ్ఞానమైయున్నాడు. ఈ జ్ఞానము క్రీస్తే. క్రీస్తు జ్ఞానముయొక్క అవతారము. సామెతలు 8, 9 మనస్సునందుంచుకొని యోహాను 1:1 ని యిట్లు ధ్యానించవచ్చును. ఆదియందు జ్ఞానముండెను, జ్ఞానము దేవునియొద్ద ఉండెను, జ్ఞానము దేవుడై యుండెను. జ్ఞానము ఆదియందు దేవునియొద్ద ఉండెను. సమస్తమును జ్ఞానము మూలముగా కలిగెను. కలిగియున్నదేదియు జ్ఞానములేకుండ కలుగలేదు. కీర్తనల

www.doctorpaul.org

గ్రంథములో క్రైస్తవుడు మోకాళ్లపైనుండినవాడుగా కనిపించగా, సామెతలలో పాదములపై సంచరించువానిగా కనిపించును. కీర్తనలు హృదయమును, ఆత్మను పరవశింపజేయును. సామెతలు పాదాలను నీతిపథములో నిలుపును.

# ప్రసంగి

ఈ ప్రసంగి సొలొమోనే. మూలభాషలో "సమాజముయెదుట బోధించు వాడు". ఇది నాస్తికులకు యిష్టగ్రంథము. వాల్తేరువంటి గొప్ప నాస్తికవాదులు ప్రసంగి గ్రంథమును తమ వాదముకొరకు బహుగా వాడుకొనిరి. జ్ఞానముగల్గి సర్వ సంపదలతో తులదూగుచు గొప్ప సామ్రాజ్యమునకు రాజుగా యేలుచుండిన సొలొమోను సూర్యుని క్రింద కొనసాగు మానవ జీవితమును మానవ దృష్టితో చూడగా అది సూన్యముగాను, వ్యర్థముగాను కనబడెను. సూర్యునిక్రింద అనేమాట 29 సార్లును, వ్యర్థము 37 సార్లును కనబడి కలవరము పుట్టించును. అధికారము, కీర్తి, బలము, సంపద, సుఖము దేవుడు మానవ హృదయములో రూపొందించిన ఖాళీని నింపలేవు. ఆ ఖాళీని దేవుడు మాత్రమే నింపగలడు. అయితే మానవ జీవితమును దేవునివైపునుండి చూడగా అది అర్థసహితముగాను, ప్రయోజన కరముగాను, గురి కల్గినదిగాను కనబడెను. కాగా ఆనందముతో ప్రసంగి – తినుము, త్రాగుము, సంతోషించుము, మేలు చేయుము, దేవునికి భయపడుము, దేవుని ఆజ్ఞలను గైకొనుము, తీర్పుకు సిద్ధపడుము అని బోధించుచున్నాడు. ప్రసంగి "ఒక్క కాపరి"ని చూచి సంతోషించినాడు. (12:11 ను యోహాను 10:9 తో పోల్చుము). శూన్యముగానున్న మానవ హృదయమును మరియు జీవితమును క్రీస్తు ప్రభువు తన నిత్యజీవముతో నింపి అర్థవంతముగాను, ఆశీర్వాదభరితముగాను మలుచుచున్నాడు. ఈ జీవితమునకు ఏమైనా అర్థమున్నదా? అనుచు నాగరికత, సైన్సు, ప్రగతి సాధించిన 21వ శతాబ్దపు నరుడు నిస్పృహచెందుచున్నాడు. అయితే సొలొమోను ఈ ప్రశ్నను కులంకషముగా పరిశోధించి ఫలితార్థమును ఆనాడే తెలియజేసియున్నాడు. అవును అర్థమున్నది. సృష్టింపబడినవాడు సృష్టికర్తను స్మరణకు తెచ్చుకొని, ఆయనకు భయపడి, తీర్పును దృష్టిలో నుంచుకొని, సృష్టికర్తతో యెడతెగని సంబంధము కలిగియుండి ఆయన నడిపింపుతో నడచినచో మానవ జీవితమునకు మహోత్కృష్టమైన గురిగలదు. దేవుని విడిచిన మనుష్యుడు ఎంత జ్ఞానము సంపాదించినను అది వ్యర్థమే.

www.doctorpaul.org

# పరమగీతము

పురాతన ప్రాచ్యసాహిత్యాలంకార సహితమైన ఈ లఘు పద్యకావ్యము సొలొమోను విరచితమని శంకించువారెందరో గలరు. నిక్కముగా దీని గ్రంథకర్త సొలొమోనే. సొలొమోను పేరు యేడుసార్లు గలదు. పరిశుద్ధ లేఖన భాండా గారములో యిలాంటి వ్రాతలకు స్థానముండవచ్చునా యని ప్రశ్నించువారుకూడ గలరు. ఐతే యూదులు పరమగీతమును పరమ పవిత్రముగా యెంచుదురు. ప్రభువును రక్షకునిగా యెరిగిన దేవుని బిడ్డకు దీనిలో క్రీస్తుప్రేమయొక్క ప్రత్యేక పరిమళము గాఢముగా గుబాళించును. బాహ్యమునకు కనబడు సొలొమోను షూలమ్మీతిల ఐహిక ప్రేమచాటున హృదయమును సమ్మోహపరచు క్రీస్తు ప్రేమయు ఆ ప్రేమకుఆకర్షితమైన విశ్వాసి హృదయాను భూతియు దాగియున్నవి. పైవచనము క్రొత్త నిబంధనలో ప్రభువైన యేసు బేతనియలోని మరియ యింటనున్నప్పుడు అక్షరాల నెరవేరెను. పరమళ సువాసన నాసికారంధ్రములకు యింపైనట్లు ఆరాధన దేవుని హృదయమును రంజిల్ల జేయును.

వరునియొక్క మహిమా సౌందర్యములను వీక్షించగా వధువుయొక్క హృదయము పరవశించుచున్నది. ఇది రాబోవుకాలములో ఇశ్రాయేలీయులు వెయ్యేండ్ల పాలనలో ప్రవేశించిన తరువాత దేవుని హృదయములో వారిపట్లగల ప్రేమానురాగముల సౌందర్యమునుచూచి పరవశించుటకును ముంగుర్తుగానున్నది. ఆత్మీయముగా ఇదిపరలోక వధువైన సంఘమునకును, వరుడైన క్రీస్తుకు వర్తించును. అయినను ఎఫేసీ పత్రికలో ఉండినట్లు వధువుయొక్క హెచ్చింపబడిన పరిపూర్ణ స్థానము స్థిరపరచ బడినట్లు పరమగీతములో కనబడును. కాని భూమిపై ఇప్పుడు మనము ప్రభువు సహవాసములో ఉండి వ్యక్తిగతముగా ఆయన పొందువలన కలుగుచుండిన హృదయానుభూతుల వర్ణన పరమగీతములో మెండుగా కలదు. సంఘముయొక్క ప్రతేకింపబడిన స్థానము ప్రముఖ్యముగా గుర్తింపబడినది. వరునిపట్ల వధువు ప్రేమలో లోపమున్నను, వధువుపట్ల వరుని ప్రేమ పరిపూర్ణ మైనదని మరొకమారు ఈ ప్రేమ కావ్యములో ఋజువైనది.

# యెషయా గ్రంథము

గ్రంథకర్త యెషయా. ఇతడు రాజు వంశీకుడు. యూదారాజైన యోవాషు మనుమడు. యెషయా గ్రంథమునకు పంచమ సువార్తయనియు, యెషయాకు

www.doctorpaul.org

పాత నిబంధనలోని పౌలు అనియు పేర్లు పెట్టుట సమంజసమే. ఇదొక చిన్న బైబిలు. బైబిలులో 66 పుస్తకములుండినట్లు దీనిలో 66 అధ్యాయములున్నవి. పాత నిబంధన లోని 39 పుస్తకములు పాపులమీదికి వచ్చు దేవుని తీర్పులను గురించియున్నట్లు యెషయాలోని మొదటి 39 అధ్యాయములు తీర్పులనుగూర్చి యుండును. తరువాత 27 అధ్యాయములు క్రొత్త నిబంధనలోని 27 పుస్తకములవలే కృపను గూర్చియు, మెస్సీయా జన్మము, కార్యము, రక్షణనుగూర్చి మాట్లాడును. యెషయా అనగా యెహోవా రక్షణ లేక రక్షించువాడని అర్థము.

భక్తుడైన అగస్టిన్ ప్రభువును నమ్మిన పిమ్మట మొదటగా బైబిలులోని ఏ పుస్తకమును చదువవలెనని యడుగగా ఆంబ్రోస్ యను భక్తుడు వెంటనే యెషయా గ్రంథమని జవాబిచ్చెనట. ఇందులో 7 నిత్య సత్య విషయములున్నవి. నిత్య రక్షణ (45), నిత్య వెలుగు (60), నిత్యానందము(35), నిత్య శక్తి (26), నిత్య కృప (54), నిత్య నిబంధన (55), నిత్య తీర్పు (33), ప్రభువుయొక్క జన్మము (7), కుటుంబము (11), అభిషేకము (11), ప్రవర్తన (11), ఆహారము (7), సరళత్వము (42), మరణము (53), పునరుత్థానము (25), మహిమా పాలన (11) సవివరముగా వ్రాయబడిన భాగము యెషయా గ్రంథమే.

యెషయా గ్రంథము ప్రభువైన యేసును మహిమారాజ్యమునేలు మెస్సీయాగా చిత్రించెను. సింహాసనమునకు ముందుగా సిలువకు వెళ్లవలసిన మెస్సీయా పాత్రను గురించి యూదులు నేటికీ తొట్రుపడుచున్నారు. క్రీస్తు రెండు రాకడలను ఈ గ్రంథము పేర్కొనెను. మొదటి రాకడ దాని ఉద్దేశము 53 లోను, రెండవ రాకడ దాని ఉద్ధేశము 34 లోను గలవు. ఈ రెండు రాకడలు రెండు కొండలు. మొదటిది అవమానకరమైన కల్వరికొండ, రెండవది మహిమాపూర్వకమైన ఒలీవల కొండ. ఈ రెండు కొండల మధ్యలోని లోయలో సంఘము సాగిపోవుచున్నది.

# యిర్మీయా

యెరూషలేముకు ఉత్తరముగా రెండు మైళ్లలో గల అనాతోతు వాస్తవ్యుడైన యాజకుడు హిల్కీయా కుమారుడగు యిర్మీయాయే దీని గ్రంథకర్త. యిర్మీయా చెప్పుచుండగా బారూకు వ్రాసెను. మెడవంచని యూదా ప్రజలకు కఠనశిక్షగా కారాగారము రాబోవుచున్నదని 40 సంవత్సరాలు కఠినశ్రమ, నింద, అవమానముల

www.doctorpaul.org

కోర్చి ప్రకటించిన ప్రవక్త. యిర్మీయా తల్లి గర్భమునుండియే దేవునిచేత దేవుని కొరకు ప్రత్యేకింపబడినవాడు. ఇతడు విలపించు ప్రవక్త. ప్రవచనములు కఠినమేగాని హృదయము అతి కోమలము. దేవుని ప్రజల భక్తిహీన దుస్థితికి హృదయము పగిలిన ప్రవక్త వ్రాసిన వ్రాతలుకూడా వరసక్రమములేకుండ చెల్లాచెదరైనట్లగపడును. యిర్మీయా అనగా యెహోవా విసర్జించును అని భావము. అట్లే ప్రభువును విసర్జించిన వారిని ఆయనకూడా విసర్జించునని ఈ గ్రంథముయొక్క సందేశము. ప్రభువైన యేసు నీతిచిగురుగా యిందు చిత్రింపబడెను. (23:5). ఆయనే నిజమైన కాపరి. ఆయనే మన నీతి. (23:6). దేవుడు అబ్రాహాముతోను, మోషేతోను (ద్వితీ. 28–30), దావీదుతోను (2 సమూ. 7) చేసిన నిబంధనలన్నియు పూర్ణముగా నెరవేరు నూతన నిబంధనను ప్రభువే తెచ్చునని యిర్మీయా తేటగా చూచి వ్రాసెను (31:31, 33). యిర్మీయా ప్రభువు పనిలో దెబ్బలుతిని బొండలలో బిగించబడిన వాడు. (20). హింసించబడి చావుకు వదలివేయబడెను (26). అనేకమార్లు చెరసాలలో వేయబడెను. (37, 38). యిర్మీయా ఏలీయాయంతటి శక్తిగల ప్రవక్త కాకపోయినను, యెషయా వంటి వాగ్ధాటి కలవాడు కాకపోయినను, యెహెజ్కేలు వలే సెరాపులను చూచినవాడు కాకపోయినను దీనుడుగాను, నిస్సహాయకుడుగాను ప్రభువుమీద అధారపడి ప్రభువు వాక్యమును నమ్మకముగా ఎదిరింపులకు జడియక ప్రకటించెను. దేవుని ప్రేమను రుచించినవాడు. ప్రజల పతనావస్థను చూచి గుండె పగిలినవాడు. పెందలకడనే లేచి ప్రకటించుట ప్రవక్త పనియని పదకొండుమారులు చూచెదము. రాజ్య చరిత్రయు, స్వీయ చరిత్రయు, ప్రవచనమును మిళితమైన ఈ గ్రంథము కీర్తనల గ్రంథముయొక్క పోలికలు గలది.

# విలాపవాక్యములు

మహారాజు పట్టణమైన యెరూషలేము మూడవసారి పట్టబడి కాల్చబడిన తర్వాత దాని శిధిలములను చూచి హృదయపరితాపముతో యిర్మీయా వ్రాసిన 5 దుఃఖ గీతికలే విలాపవాక్యములు. ప్రభువైన యేసు విలపించు ప్రవక్తగా యిందు చిత్రింపబడెను. ఆరు శతాబ్దముల పిమ్మట ఆయన అట్లే యెరూషలేమును చూచి విలపించెను. (మత్తయి 23:37, లూకా 19:41). యిర్మీయా ప్రభువైన యేసువలే దుఃఖాక్రాంతుడును స్వజనులచేత తృణీకరింపబడినవాడు.

www.doctorpaul.org

దుఃఖహృదయుడైన యిర్మీయా దేవుని విశ్వాస్యతను శ్లాఘించుచు వెల్లడించిన తన స్వంత నమ్మిక బహుగా ఆదరణ కల్గించు లేఖన భాగమని ప్రసిద్ధికెక్కినది. "యెహోవా కృపగలవాడు. ఆయన వాత్సల్యత యెడతెగక నిలుచునది గనుక మనము నిర్మూలము కాకున్నవారము. అనుదినము నూతనముగా ఆయనకు వాత్సల్యత పుట్టుచున్నది. నీవు ఎంతైనా నమ్మదగినవాడవు. యెహోవా నా భాగము" (3:23, 34).

ప్రభువును సిలువ వేసిన కల్వరికొండపైన పచ్చికతో కప్పబడిన ఒకగుట్టను నేడు యిర్మీయా పీఠమని పిలచెదరు. యిర్మీయా అక్కడకూర్చుని విలాపగీతములను రచించెనని భక్తిగల యూదుల నమ్మిక. ప్రతి శుక్రవారమునాడు యూదులు విలాప గోడవద్ద నిల్చుని ఈ గీతములను దుఃఖముతో గానము చేసెదరు.

లేవీయకాండము 6:26 లో చెప్పబడిన పాపపరిహారార్థ బలిని తినుటయొక్క ఆత్మీయభావమును యిర్మీయా వ్యక్తిగతముగా గైకొనెను. ఇతడు యాజకుడు గనుక ప్రజల పాపమును తన స్వంత పాపముగా యెంచుకొనెను. నేడు దేవుని సమాజము ఆనాటి యెరూషలేమువలె శిథిలావస్థలోనున్నదని ప్రతి దేవునిబిడ్డ గ్రహించి తీర వలెను. నేటి విశ్వాసుల ఆత్మీయస్థితి దిగజారినస్థాయిలో ఉండెను గనుక ప్రతిపని వాడు యిర్మీయా వలే విలపించక తప్పదు. దేవుని ప్రజలు తమ పాపమును ఒప్పుకొని ఆయన మార్గమును తిరిగి చేపట్టినచో ఆయనకు అనుదినము నూతనముగా వాత్సల్యము పుట్టును గనుక బహుగా క్షమించును.

# యెహెజ్కేలు

బూజీ కుమారుడైన యెహెజ్కేలు గ్రంథకర్త. యిర్మీయావలే యితడును యాజకుడుగా నున్నప్పుడు ప్రవక్త పనికై పిలువబడెను. దేవుని శక్తిని, యేర్పాట్లను తెలియపరచు అనేక దర్శనములను చూచి వాటిని చిత్రకారునివలే కలముతో చిత్రించిన యెహెజ్కేలు యూదా చరిత్రలో చీకటిఘడియగా నుండిన డెబ్బదియేండ్ల చెరలో బబులోనులో తన ప్రవక్త పదవిని నిర్వహించెను. యెహెజ్కేలు అనగా దేవుని చేత బలపరచబడువాడు. అట్లే యితడు తన విధి నిర్వహణకై దేవునిచేత బలపరచ బడినవాడు (3:8,9). యెహెజ్కేలు గ్రంథములో ప్రభువైన యేసు మనుష్యకుమారుడు (నరపుత్రుడు) గా చూపించబడెను. చెరలోనున్న తన ప్రజలకు

www.doctorpaul.org

వారికా శిక్షాఫలము ఏల దాపురించెనో వినిపించెడి దేవుని స్వరమే యెహెజ్కేలు. "యెహోవా వాక్కు నా యొద్దకువచ్చి (ప్రత్యక్షమై)" అనెడి పదజాలము యిందు నలుబది తొమ్మిదిసార్లు కనబడును. యెహెజ్కేలు, యిర్మీయా, దానియేలు యీ ముగ్గురు ఏకకాలములో ప్రవక్తలు. యిర్మీయా యెరూషలేములో విడువబడినవారికి, యెహెజ్కేలు బబులోను చెరసారలోని యూదులకు, దానియేలు రాజనగరులోను ప్రవక్తలుగా నుండిరి. కెబారు నదియొద్ద చెరగొనబడిన ప్రజలకు చెరలోని ఒక వ్యక్తిగా ప్రవచించెను.

మూలపదము : యెహోవా హహిమ. చెరలోని యూదులమధ్య కొందరు అబద్ధ ప్రవక్తలు లేచి యెరూషలేము నాశనముచేయబడదనియు, త్వరలోనే వారందరు స్వదేశమునకు తిరిగి వెళ్లుదురనియు ప్రకటించుచుండగా యిర్మీయా వారికొక లేఖ పంపెను. (యిర్మీయా 29:3). యిర్మీయా లేఖ ప్రకారము యెహెజ్కేలు వారిని హెచ్చరించెను. యెరూషలేముకు తిరిగి వెళ్లుదమని ఆశపడుటకంటే వారు హృదయ పూర్వకముగా దేవునియొద్దకు ముళ్లుకొనవలెనని నిజమైన సువార్తికుని భారముతో దేవుని మాటను గైకొని నా జీవముతోడు దుర్మార్గుడు మరణము నొందుట వలన నాకు సంతోషములేదు, దుర్మార్గుడు తన దుర్మార్గత నుండి మరలి బ్రదుకుటవలన నాకు సంతోషము కలుగుననుచు ప్రకటించి అందులో కృతార్థు డాయెను. యెషయా "కుమారుని" గురించి యిర్మీయా "తండ్రి"ని గూర్చియు యెహెజ్కేలు "ఆత్మ"ను గూర్చియు ప్రవచించిరి.

# దానియేలు

దేవునికి బహుప్రియుడైన దానియేలు దీని గ్రంథకర్తయని నిరూపించుటకు ప్రభువైన యేసు మత్తయి 24:15 లో యిచ్చిన సాక్ష్యము చాలును. ఇతడు నీతిమంతుడని సమకాలీన యెహెజ్కేలు ముమ్మారు పల్కెను. అన్యజనాంగముల లోని చక్రవర్తులకు యెహోవా దేవుడే నిజమైన, నిత్యసార్వభౌమాధికారియని తెలియజేయుటకై దేవుని ప్రవచన వాణికి స్వరపేటిక పనిజేసినవాడే దానియేలు. ఇందులోని 12 అధ్యాయములలోని 9 అధ్యాయములు కలలు, దర్శనములను గూర్చినవే. మనుష్యుల వ్యవహారములలో దేవుని జోక్యము, నడిపింపు, కాపుదల ఉండునని నిరూపణ కావించిన చరిత్రఘట్టములిందుగలవు, దానియేలు అనగా

www.doctorpaul.org

దేవుడే నా తీర్పరి (న్యాయాధిపతి) అని భావము. దానియేలు గ్రంథము ప్రభువైన క్రీస్తును పగులగొట్టు రాయిగా చిత్రించెను. దానియేలు దర్శనముల ప్రవక్త. ఇందులోని దర్శనముల భావమును గ్రహించకుండా ప్రకటన గ్రంథమును అర్థము చేసికొనుట దుర్లభము.

దానియేలు భూమిపై ప్రముఖుడుగా యెహెజ్కేలు 14:14 లో పేర్కొనగా అతడు పరమందును ప్రముఖుడేయన్నట్లు రెండుసార్లు పరలోకమునుండి వినబడెను (దానియేలు 10:11, 19). కోరెషు పుట్టకపూర్వమే 120 యేండ్లక్రిందట యెషయా అతని జన్మమును గురించి వ్రాసిన ప్రవచనమును దానియేలు కోరెషుకుచూపగా అతడు ప్రభావితుడై దేవుని మహిమపరచగోరి యెరూషలేమందున్న దేవుని మందిరమును పునర్నిర్మించ అజ్ఞ యిచ్చెను. ( 2 దిన. 36:22, 23; ఎజ్రా 1). దానియేలు 70 వారములు ప్రవచన నిధికి తాళపుచెవి. బబులోను, మాదీయ, పారశీక రాజ్యములలో రాజనీతిజ్ఞుడుగను, దేవుని ప్రజలపట్ల ప్రవక్తగను విలసిల్లిన దానియేలు విషయములలోకూడ యోసేపువలే వ్యక్తిగత లోపములు వ్రాయబడలేదు. ప్రభువుకుగల మనుష్యకుమారుడను పేరు 7:13 లోనే చూచెదము. దానియేలు ప్రధానమంత్రులలో ప్రవక్త – ప్రవక్తలలో ప్రధానమంత్రి. వ్యక్తిగతముగా పరిశుద్ధ ప్రవర్తన గలవారిని దేవుడు తన ఆత్మతో నింపి సకలజ్ఞాన సంపూర్ణులనుగాజేసి తన మర్మములను బయలుపరచి వారిని హెచ్చించువాడని యోసేపు, దానియేలు జీవితములు చాటిచెప్పెను.

# హోషేయ

గ్రంథకర్త హోషేయ. హోషేయ అనగా రక్షణ. ఎఫ్రాయిమీయులు అధికసంఖ్యలోగల ఉత్తర ఇశ్రాయేలులో ఇతడు పరిచర్య గావించెను. ఆనాడు ఇశ్రాయేలీయులు అన్యదేవతలను పూజించి ఆత్మీయముగా వ్యభిచారులైనందున దేవుడు వారికి సూచనగా హోషేయను వ్యభిచారియైన గోమెరును పెండ్లాడ నాజ్ఞాపించెను. హోషేయ భార్యను ప్రేమించి అమె ఎంతో అపనమ్మకముగా నుండినను తానుమాత్రము నమ్మకమైన ప్రేమతో ఆమెపట్ల వ్యవహరించెను. అట్లే ఆనాటి దేవుని ప్రజల యెడల దేవుడు వ్యవహరించెను. ఆనాటి దేశ పరిస్థితికి 4:1, 2 చక్కగా అద్ధము పట్టుచున్నది. సత్యమును, కనికరమును, దేవుని గూర్చిన

www.doctorpaul.org

జ్ఞానమును దేశమందు లేకపోయెను. ఎవరు దేవుని అనుగ్రహము ఎక్కువగా పొందిరో వారే దేవునికి ఎక్కువ బాధ్యులని 5:14లోని సత్యము. ఎఫ్రాయిమీయులకు సింహమువంటి వాడనుగాను, యూదా వారికి కౌరమసింహమువంటి వాడనుగాను నేనుందునని ప్రభువు సెలవిచ్చెను. ప్రవక్తయొక్క హృదయపుటాశ 6:3 లో తేటతెల్లము.

హోషేయ 12 చిన్న ప్రవక్తలలో మొదటివాడు. ఇతడు 50 సంవత్సరములు దేవుని ప్రవక్తగానుండెను. ప్రపంచములోని ప్రేమికులలో హోషేయకు ప్రథమ స్థానము లభించును. భార్యయొక్క నీచప్రవర్తనను పూర్తిగా యెరిగియుండినను ఆమెను హృదయపూర్తిగా ప్రేమించి కాపురము చేసెను. ఇతడు పరిచర్య చేసిన కాలము 2వ రాజులు 15–17 అధ్యాయములలోని చరిత్రభాగము. యోగ్యత లేనప్పటికిని అనుగ్రహము చూపుటయే కృప అను సత్యము చక్కగా ప్రదర్శింపబడిన గ్రంథము. వెనుదిరుగుట–ఈ గ్రంథములోని మూలపదము. దేవునివిడిచి లోకమువైపు పోవువాడు వెనుదిరిగి దేవుని ప్రేమను తిరిగి పొందుట దేవుని హృదయాభిలాష. హోషేయలో పశ్చాత్తాపము, వెనుక జారినవాడు తిరిగి ప్రభువువైపు తిరుగుట అను ప్రధాన అంశములు మనోహరముగా గ్రంథస్థము చేయబడినవి.

# యోవేలు

బైబిలులో అనేకమంది యోవేలులు గలరు. అయితే దీని గ్రంథకర్త పెతూయేలు కుమారుడైన యోవేలు. వీరు యెరూషలేమునకు సమీపమున నివసించిన యాజక కుటుంబీకులు. యోవేలు అతగా యెహోవా (నా) దేవుడు అని అర్థము. యోవేలుకు ఉజ్జీవపు ప్రవక్తయను నామాంతరము గలదు.

ఇశ్రాయేలు దేశముపైకి తెగులు వచ్చి పచ్చని ప్రతి ఆకును నాకివేసెను. ఇశ్రాయేలు పాపమునుబట్టి తాను విధించిన తీర్పును నిర్వహించు మహా సైన్యముగా క్రిమికీటకాదులు, పసరు గొంగళిపురుగులను దేవుడు వాడెను (2:25). పరిశుద్ధాత్మ కుమ్మరింపును గూర్చి మొదటగా ప్రవచించిన ప్రవక్త యోవేలు. ఇశ్రాయేలు గొప్ప ప్రవక్తలు ఏలీయా, ఎలీషాలను యోవేలు చిన్నతనములో యెరిగినవాడు. ఇందలి మూలపదము : ప్రభువుయొక్క దినము. యోవేలు వర్ణించిన తెగులు రానున్న ప్రభువుయొక్క దినపు తీర్పులకు సూచనప్రాయముగా నున్నది. ఆ తెగులు

www.doctorpaul.org

తాకిడిని వృద్ధులును, పిల్లలును అనుభవించిరి. తెగులువల్ల ద్రాక్షతోటలు హరించుకొనిపోగా త్రాగుబోతులు బాధనొందిరి (1:5). యాజకులకు అర్పణకై పశువులు లేవు (1:9). పొలములోని పశువులు మేతలేక శోకించినవి. ఈ మహా విపత్తుకు కారణమేమో పరిశీలించుకొనుడని యోవేలు ప్రజలను మొర్కొలిపెను. మీ పాపములను క్షమించుటకు మీ దేవుడైన యెహోవా కరుణావాత్సల్యములు కలవాడుగనుక మీ వస్త్రములను కాక మీ హృదయములను చించుకొనుడని హెచ్చరించెను. చిరిగిన హృదయము చిరిగిన తెరను, చిరిగిన ఆకాశమును చూచును.

# ఆమోసు

భారమును మోయువాడని అర్థమిచ్చు నామధేయుడును, యెరూషలేముకు దక్షిణముగా 12 మైళ్ల దూరమునగల తెకోవ అను పల్లెటూరి పశువుల కాపరియునైన ఆమోసు దీని గ్రంథకర్త. ఇతడు మేడిచెట్లను నాటి ఫలసంగ్రహముచేయు మేటి వ్యవసాయి. తెకోవ బేత్లెహేముకు 6 మైళ్ల దూరమునేగలదు గనుక యితడు యూదయవాడే. పండ్లతోటనుమాత్రమేగాక నాణ్యమైన ఉన్నినిచ్చు శ్రేష్టజాతి గొర్రెలను కూడా పెంచెడి పశువుల కాపరి. అంతేకాక ధర్మశాస్త్రమును కీర్తనలను హృదయమునకు అన్వయించుకొనిన పఠిత. రచనాశైలినిబట్టి చూడగా ఉన్నినమ్ముకొనుచు దేశసంచారము చేసినవాడని తెలియుచున్నది. నీతిన్యాయములు దేశములో నీటివలే ప్రవహించవలెనని ఆశించిన దేశభక్తుడు. ఆమోసు నిజమైన దేశభక్తియు, సాంఘిక న్యాయమును విడదీయజాలవని నమ్మిన ప్రవక్త. దేవుని నీతికి, దేవుని వాక్యమట్టపు గుండుకు సరిపడిన భక్తిని బేతేలులో ప్రబోధించిన రోషముగల ప్రవక్త.

ఆనాటి ప్రజల భక్తి వేసవికాలపు పండ్లగంపవలే కుళ్లిపోవుటకు సిద్ధముగానున్నది. ఇందలి మూలపదము : తీర్పు. నిజము నిర్భయముగా ప్రకటించు ధీశాలి. దేవుని ప్రజలకు ఒక నిర్దిష్ట శిక్షను ప్రకటించుటకై ఆమోసు పిలువబడెను. (3 అధ్యాయము). సారిసారి ప్రకటించిన దేవుని హెచ్చరికలను తిరస్కరించినవారికి శిక్ష తప్పదు. (5 అ). తాము దేవునిచే ఏర్పరచుకొనబడిన జనాంగముగనుక వారికి కీడు సంభవించదని చెప్పుకొనుచు తప్పుభావనలో నుండిరి. నేడు చాలమంది క్రైస్త వులు వీరివలె తాము ఒక ప్రఖ్యాత పురాతన క్రైస్తవ సంఘములో సభ్యులు గనుకను బాప్తిస్మము మున్నగు మతాచారములను గైకొనిరి గనుకను వారు శిక్షకు పాత్రులు కాబోరని తలంచెదరు.

www.doctorpaul.org

# ఓబద్యా

పాత నిబంధనలో అతి చిన్న పుస్తకము. పాత నిబంధనలో పదముగ్గురు ఓబద్యాలు గలరు. వీరిలో ఒకరు దీని వ్రాసియుండెనని మాత్రమే చెప్పగలము. ఒకవేళ మొదటి రాజులు 19:3 లోని ఓబద్యా కావచ్చును. ఓబద్యా అనగా సేవకుడు లేక యెహోవా ఆరాధికుడు అని అర్థము. ఇందలి మూలపదము : ఎదోము తీర్పు.

ఎదోము అనగా ఏశావు. ఎదోమీయులు ఏశావు సంతతి వారు. తరుణము దొరికితేచాలు యాకోబు సంతతికి కీడుచేయ నుద్దేశించు ఎదోమీయులు ఇశ్రాయేలుకు నిత్యశత్రువులు. నెబుకద్నెజరు యెరూషలేమును ముట్టడివేసి ఇశ్రాయేలును చెరకొని పోగా ఎదోము బహుగా సంబరపడెను (కీర్తనలు 137:7).

ఓబద్యా 1–10 వరకు ఎదోము అవమానముకలదు. అన్యులందరిలో అల్పుడును, బొత్తిగా చెడినవాడునైయుండెను (2, 5, 7). ఎదోమును ద్వేషింపవలదని దేవుడుసెలవిచ్చెను (ద్వితీ. 23:7). ఐతే ఎదోము చేసినదేమి? మమ్మును నీ దేశమును దాటిపోనిమ్ము, నీ ద్రాక్షతోటలనంటము, నీ బావుల నీళ్లు త్రాగము అని అరణ్యమార్గమందుండిన ఇశ్రాయేలు వేడుకొనినను ఎదోము ఖడ్గము చూపెనేగాని సమ్మతించలేదు. కావున దేవుడు ఎదోముపై తీర్పును ప్రకటించెను. పక్షిరాజు గూడంత ఎత్తున పర్వతములను నిర్మించుకొనిన ఎదోమీయులు దేవుని ప్రజలకు విరోధముగా చేయిఎత్తిరి గనుక వారికి నాశనము తప్పలేదు.

# యోనా

గలిలయలోని నజరేతుకు ఉత్తరముగా మూడుమైళ్ల దూరమునగల గత్హెపెరు ఊరివాడైన అమిత్తయికి పుట్టిన యోనా ప్రవక్త దీని గ్రంథకర్త (2 రాజులు 14:25). యోనా అనగా గువ్వ లేక పావురము. యోనా రెండవ యరొబాము కాలములో ఎలీషా తదనంతరము ఆమోసు హోషెయలకు కొంచెము ముందుగా ఇశ్రాయేలులో ప్రవక్తగా నుండినవాడు.

ప్రభువైన యేసు తనతో పోల్చుకొనిన ఒకే ఒక ప్రవక్త యోనా. బైబిలు విమర్శకులు దీనిని కట్టుకథగా భావింతురు కాని ప్రభువు మత్తయి 12:39–41లో

www.doctorpaul.org

యిచ్చిన సాక్ష్యము దీనిని దృఢముగా ధృవపరచును. పురాతన యూదుల అధికారులు యోనాను సారెపతు విధవరాలి కుమారునిగా గుర్తించిరి.

యోనా దేవుని మాటకు ఎందుచేత అవిధేయత చూపెను? కొందరు భావించి నట్లుగా పాపులకు భయపడికాదు. యోనాకు మూఢమైన దేశభక్తిగలదు. అష్షూరు ఇశ్రాయేలుకు బద్ధశత్రువు, తాను రక్షణవర్తమానము ప్రకటించినచో ఒకవేళ వారు దేవునిచే కాపాడబడి ఇశ్రాయేలుకు విరోధముగా నిలిచియుందురుగనుక వారి నాశనమును కోరి నీనెవె పట్టణమునకు వెళ్లనొల్లకయుండెను.

అయితే దేవుడు “కటాక్షమును జాలియు బహుశాంతమును అత్యంత కృపయుగల దేవుడైయుండి పశ్చాత్తాపపడి కీడుచేయక మానువాడని” (యోనా 4:2) యోనాకు క్రియాపూర్వకముగా పాఠము చెప్పెను. ఈ గొప్ప పాఠముకై దేవుడు వాడుకొనిన (సిద్ధపరచిన) సాధనములు చూడుడి. గొప్ప మత్స్యము 1:17, సొరచెట్టు 4:6, పురుగు 4:7, వేడిగల తూర్పుగాలి 4:8.

దేవుని కృపా ఉద్దేశ్యములను మానవుని అవిధేయతగాని, స్వార్థపు యెత్తు గడలుగాని భంగము చేయజాలవు. దేవుడు యూదులకును అన్యులకును దేవుడే (రోమా 3:29). నిజమైన పశ్చాత్తాపము పాపికి శిక్షను తప్పించి రక్షణ కలుగజేయును.

# మీకా

యెరూషలేముకు నైఋతిమూలగా 25 మైళ్ల దూరమునగల మోరష్తీ గ్రామ వాసియైన మీకా దీని గ్రంథకర్త. మీకా అనగా నీవంటి దేవుడెవరు అని అర్థము. ఇతని కుటుంబ వివరములు తెలియవు. ధనవంతులు బీదలను అణచివేయు చుండగను అధికారులు తమ ప్రాబల్యమును స్వార్థమునకు వినియోగించు కొనుచుండగను ప్రవక్త భరించలేనివాడై దేవుని ప్రజలుండవలసిన తీరుతెన్నులు వారికి పకటించెను: న్యాయముగా నడుచుకొనుటయు, కనికరమును, ప్రేమించు టయు, దీన మనస్సు కలిగి నీ దేవుని యెదుట ప్రవర్తించుటయు ఇంతేగదా యెహోవా నిన్నడుగుచున్నాడు. ఆనాటి సాంఘిక పరిస్థితి కళ్లకు కట్టినట్లుగా 7:1–6 లో వివరించినాడు.

యూదాకు చెందిన మీకా యెషయా సమకాలీనుడు. రక్షకుని జన్మస్థలమును ముందుగా చూచినవాడు–బేత్లెహేము ఎఫ్రాతా. . . . నా కొరకు ఇశ్రాయేలును

www.doctorpaul.org

ఏలబోవువాడు నీలోనుండి వచ్చును (5:2). రక్షకుని కార్యముద్వారా పాపికి కల్గు నీతినికూడ గమనించినవాడు–ఆయన మనయందు జాలిపడును. మన దోషములను అణచి వేయును. వారి పాపములన్నింటిని సముద్రపు అగాధములో పడవేతువు (7:19). మీకా పేరుకు తగినట్లుగా దేవుని కీర్తించుటను 7:18 లో చూచెదము – వారుచేసిన అతిక్రమముల విషయమై వారిని క్షమించు దేవుడవైన నీతో సముడైన దేవుడున్నాడా? ఆయన కనికరము చూపుటయందు సంతోషించువాడు.

మీకా ఆత్మావేశముచేత బలముతోను, తీర్పు తీర్చు శక్తితోను, ధైర్యముతోను నింపబడినవాడు (3:8). మెస్సీయ రాజ్యమునుకూడ మీకా చూచాయగా పేర్కొనెను. ఆయన రాజ్యమునకు యెరూషలేము ముఖ్యపట్టణము (4:1, 2). ఆ రాజ్యము సమాధానముతో విలసిల్లును (4:3). ఆశీర్వదము, అభివృద్ధి దాని ధన్యతలు (4:4). ఆయన రాజ్యమునకు పునాది నీతి.

# నహూము

ఎవనికి ఎక్కువగా ఇయ్యబడెనో వానియొద్ద వానియొద్ద ఎక్కువగా తీయజూతురు (లూకా 12:48). ఒకే నిజమైన దేవుని గూర్చిన జ్ఞానము యీ మహా పట్టణమున కివ్వబడెను. యోనా ప్రకటనను విని పశ్చాత్తాపపడెను గనుక దేవుడు దానికి విధించిన తీర్పును ఆపివేసెను. దానిపిమ్మట నూరు సంవత్సరములకు ఇప్పుడు ఎల్కోషువాడైన నహూము నీనెవె యొక్క పతనమును ప్రవచించుచున్నాడు. కొందరు చరిత్రనెరిగినవారు కపెర్నహూముయొక్క మొదటి పేరు ఎల్కోషు అనియు నహూము గౌరవార్థము దానిని కఫెర్–నహూము = కపెర్నహూముగా మార్చి రనియు చెప్పుదురు. కఫెర్ అనగా పట్టణము. కపెర్నహూము అనగా నహూము పట్టణము. నహూము అనగా ఆదరణ. నీనెవెను ముఖ్యపట్టణముగాగల అష్షూరీ యులు యూదాను బహుగా వేదించిరి గనుక బబులోను నీనెవెను ధ్వంసముచేయగా యూదాకు ఆదరణ కల్గెను. దాని తర్వాత యిక నీనెవె తిరిగి కట్టబడలేదు.

అష్షూరు రాజైన సన్హెరీబు గర్వించి యెహోవాదేవుని యిట్లు తూలనాడెను. “యెరూషలేము లష్షూరురాజు చేతికి అప్పగింపబడదనిచెప్పి నీవు నమ్ముకొనియున్న నీ దేవునిచేత మోసపోకుము” అని హిజ్కియాకు కబురంపెను (2 రాజులు 19:10). దానిని సవాటుగా గైకొనిన దేవుడు ప్రవక్తయైన యెషయాద్వారా హిజ్కియాకిట్లు

www.doctorpaul.org

వర్తమానము పంపెను. సన్హెరీబు భయపెట్టినది హిజ్కియాను కాదు యెహోవా దేవునే అనుచు సన్హెరీబును సంబోధించుచు “నీవు ఎవనిని తిరస్కరించితివి ? ఎవనిని దూషించితివి. ఇశ్రాయేలీయుల పరిశుద్ధ దేవునినేగదా ?” యనెను. కాగా “ఆ రాత్రియే యెహోవాదూత బయలుదేరి అష్షూరు దండు పేటలోజొచ్చి లక్ష యెనుబది యయిదు వేలమందిని హతము చేసెను” (2 రాజులు 19:35). దీని తర్వాత సన్హెరీబు తిరిగి నీనెవెకు పోయెను. ఆ నీనెవెకు కలుగబోవు పతనముగూర్చి నహూము యీ ప్రవచనము వ్రాసెను. నీనెవె విత్తినదే నీనెవె కోసెను. ఇది దేవుని కట్టడ.

# హబక్కూకు

ప్రవక్తయైన హబక్కూకు (1:1) అని వ్రాయబడెను. గనుక యీ హబక్కూకు వృత్తిరీత్యా ప్రవక్త. ఇతడు ప్రార్థనను వాద్యములతో పాడదగిన కీర్తనగా మలచి ప్రధాన గాయకునికి పంపెను గనుక యీ ప్రవక్త యెరూషలేము దేవాలయ పరిచర్యలో పొత్తుకల్గినవాడుగా తెలియును. హబక్కూకునకు విశ్వాస ప్రవక్తయని పేరుగలదు.

ఎంతకాలము దుర్మార్గత సహింపబడును ? ఎందుచేత దుష్టులు అభివృద్ధి నొందవలెను ? ఇశ్రాయేలీయులు చెడ్డవారే. మరి అంతకంటే ఎక్కువ చెడ్డవారు వీరిని జయించుటేల. ఈ ప్రశ్నలతో హబక్కూకు సతమతమగుచుండెను. ఈ ప్రశ్నలను ప్రార్థనలో దేవునికి తెలుపుటకై గోపురమునెక్కెను. అతడు ప్రార్థనలో కనిపెట్టెను (2:1). దేవుడు జవాబిచ్చెను. హబక్కూకు తనచుట్టు చూచి కలవరపడెను. ఐతే ప్రార్థించగా జవాబుదొరికెను. ఫలితముగా కీర్తన పాడెను.

**మొదటి అధ్యాయము “కనిపెట్టి చూడుము”**
**రెండవ అధ్యాయము “నిలువబడి చూడుము”**
**మూడవ అధ్యాయము “మోకరించి చూడుము”**

హబక్కూకు సంఘసంస్కరణకు పితామహుడు. నీతిమంతుడు విశ్వాస మూలముగా జీవించును అని పౌలు హబక్కూకునుండి నేర్చుకొనగా పౌలునుండి మార్టిన్ లూథర్ నేర్చుకొనెను. కాగా హబక్కూకును సంస్కరణకు తాత అని చమత్క

www.doctorpaul.org

రింతురు. ఇందలి మూలపదము : "ఎందుకు" ? యూదా ప్రజల హృదయ కాఠిన్యమును, భక్తిహీనులు భక్తిపరులను అణచివేయుటను, దుర్మార్గులు నీతిమంతులను నాశనము చేయుటను దేవుడెందుకు అనుమతించుచున్నాడు ? ఈ కలవరముతో ప్రవక్త ప్రార్థనలో ప్రవేశించెను. అయితే దేవుడు తన పరిశుద్ధాలయములో ఉన్నాడు. యూదులదేమి, కల్దీయులదేమి అందరి పాపమునకు ఆయనే తీర్పు తీర్చును. అయితే విశ్వాసి చుట్టుప్రక్కల నాశన పరిస్థితులు నెలకొనినను తన రక్షణకర్తయైన దేవునియందు సంతోషించుచుండును (3:18).

# జెఫన్యా

జెఫన్యా రాజవంశమునకు చెందిన రాకుమారుడు. హిజ్కియా కుటుంబము లోనివాడు. జెఫన్యా అనగా "యెహోవాచేత దాచబడినవాడు". పాపమును శిక్షించు దేవుని ఉగ్రత దినమున నీతిమంతులైన దేవుని పిల్లలు దాచబడుదురని (2:3) జెఫన్యా ప్రకటించిన వర్తమానమునకు అతనిపేరు సరిపడును. యెహోవాయొక్క దినము అనుమాట ఏడుసార్లు వచ్చును. కాని యిందులోని మూలపదము రోషము (1:18, 3:8) తన ప్రజల హృదయపూర్వకమైన ప్రేమానురాగములు ప్రభువుకే చెందవలెను. అట్లుగాక వారు విగ్రహములను ప్రేమించి అన్యదేవతలవైపు వారి హృదయములు మళ్లినచో దేవుడు తన రోషాగ్నితో తన ప్రియులైన పిల్లలను శిక్షించును.

భార్యను ప్రేమించు భర్తయెడల భార్య అపనమ్మకముగా నుండినచో ఆమె పట్ల అతని హృదయములో రోషాగ్ని పుట్టునుగదా ! ఇట్టి రోషమునకు జాన్ మిల్టన్ "పేమ నరకము" అని పేరిడెను. అపనమ్మకస్థురాలైన భార్యతోడి కాపురము భూమిపై నరకమేగదా. అందువల్ల జెఫన్యా గ్రంథము మొదటి భాగములో భయంకరమైన శిక్షలు శాపములు కనబడును. అయితే ఈ శిక్షలు విలియంకూపర్ చెప్పినట్లు ప్రేమయొక్క పై పొర మాత్రమే. దాని అడుగున మృదువైన ప్రేమ కలదు. "యెరూషలేమా భయపడకుము ....... నీ దేవుడైన యెహోవా నీ మధ్యన ఉన్నాడు. ఆయన బహు ఆనందముతో నీయందు సంతోషించును, హర్షించును" (3:17-20) 3:17 ను ఆంగ్లములో చూడగా ప్రభువు పాడుచుండినట్లు గమనించెదము. పాత నిబంధన అంతటిలోకెల్లా మధురమైన ప్రేమగీతము జెఫన్యా చివరలో గలదు.

www.doctorpaul.org

# హగ్గయి

ఈ గ్రంథములో వ్రాయబడినది తప్ప దాని కర్తనుగూర్చి మనకంతగా తెలియదు. హగ్గయి అనగా "నా విందు" అని భావము. ఇతడు జెకర్యాకంటే రెండు మాసములు ముందు తన పరిచర్య మొదలిడెను. జెకర్యా మూడేండ్లు ప్రవచించెను గాని హగ్గయి నాలుగు నెలలు మాత్రమే ప్రవచించెను. హగ్గయి, జెకర్యా, మలాకీ యీ ముగ్గురు చెరతీరిన పిమ్మట యెరూషలేములోని యూదులకు ప్రవక్తలుగా నుండినవారు.

యెరూషలేము చేరిన యూదులు మందిర పునర్నిర్మాణమునకు పూనుకొని పునాది వేసిరి. అయితే కొద్దికాలమునకే వారి ఆసక్తి తగ్గిపోయి నిర్మాణము నాపివేసిరి. పదిహేను సంవత్సరములు మందిరపు పని ఆగిపోయెను. ఈ కాలములో ప్రతివాడు తన తన స్వంతగృహములకు చక్కని సరంబీలువేసి నిర్మించుకొనిరి. 16 వ సం॥లో హగ్గయి ప్రజలను పురికొల్పి జెరుబ్బాబెలు, యెహోషువల నాయకత్వమున మందిర నిర్మాణమును చేపట్టెను. ఇప్పుడు మరొక క్రొత్త నిరుత్సాహము ఎదురైనది. అదేమనగా వారిలో ముదుసలివారు హగ్గయి నిర్మించు మందిరము చాలా అల్పమైనదనియు పూర్వముండినదాని మహిమగాని వైభవముగాని దీనికి లేవనుచు ప్రజలను నిరుత్సాహ పరచిరి. అయితే హగ్గయి సంతోషకరమైన యెహోవావాక్కు తెచ్చి ప్రజలను ధైర్యపర చెను. "నా ఆత్మ మీ మధ్యన ఉన్నది. నేను ఈ మందిరమును మహిమతో నింపుదును. కడవరి మందిరముయొక్క మహిమ మునుపటి మందిరముయొక్క మహిమను మించును" 2:5-9. చివరకు నాల్గుసంవత్సరములు దీక్షతో కృషిచేసి మందిరమును పూర్తికావించి హగ్గయి సఫలీకృతుడయ్యెను.

# జెకర్యా

ఇద్దో మనుమడు జెకర్యా దీని గ్రంథకర్త. బహుశా బెకర్యా చనిపోగా జెకర్యాను తాతయైన ఇద్దో పెంచియుండవచ్చును. జెకర్యా బబులోను చెరలో జన్మించెను. ఇతడు యాజకుడును ప్రవక్తయునై యుండెను. జెకర్యా అనగా "యెహోవా జ్ఞాపకము చేసికొనుము". బెకర్యా అనగా "యెహోవా దీవించును".

www.doctorpaul.org

ఇద్దో అనగా "నియమిత కాలములో" అని భావము. జెకర్యా కవిశ్రేష్ఠుడు. ఇతని 14 అధ్యాయములు గొప్ప దర్శనములతో నిండియున్నవి. క్రీస్తు రెండవ రాకడను గూర్చి మనోజ్ఞముగా చిత్రించిన దీర్ఘదర్శి. ప్రభువుయొక్క దీనత్వము, మానవత్వము, దైవత్వము, యాజకత్వములను జెకర్యా సజీవముగా చిత్రించెను. ఆయనను కొట్టబడిన కాపరి (13)గాను, దీనుడుగా ప్రజలయొద్దకు వచ్చిన రాజుగాను (9) చిత్రించెను. అప్పటికి దేవాలయము తిరిగికట్టుట ఆరంభమై పండ్రెండేళ్లకు పైబడినా సగముమాత్రమే పూర్తియాయెను. నిరుత్సాహముజెందిన ప్రజలను ప్రోత్సహించుటకై జెకర్యా నియుక్తుడయ్యెను. రాబోవు దినములలో దేవాలయముయొక్క మహిమై శ్వర్యమెట్లుండునో, దానిలో మెస్సీయ మహిమ ఎట్లు తాండవించునో దేవుని ప్రజలకు కలుగబోవు ఉజ్జ్వల భవిష్యత్తును ఆయా దర్శనములలో చూచి తెలియజేసిన నిరీక్షణ వాది జెకర్యా. జెకర్యా హగ్గయికి సహచరుడు.

యెషయా తర్వాత క్రీస్తును అనేక కోణములగుండా చూచిన ప్రవక్త జెకర్యాయే. ప్రభువును జెకర్యా చిగురుగాను, సేవకుడుగాను (3:8), మంచి కాపరిగాను (9:16), కొట్టబడిన కాపరిగాను (13:7), ముప్పది వెండినాణెముల కమ్మబడినవాని గాను (11:12), చేతులు గాయపడినవానిగాను (12:10), ఒలీవలకొండపైకి రాబోవు రాజుగాను చూచెను. జెకర్యా గ్రంథమును పాత నిబంధనలోని ప్రకటన గ్రంథమని నుడివెదరు.

# మలాకీ

మలాకీ అనగా "నా దూత" అని అర్థము. దూతలకు చెందిన నామధేయము గల ఇతని పుట్టుపూర్వోత్తరములు తెలియవు. ఇతడు యాజకులను దేవుని దూతలు గాను, బాప్తిస్మమిచ్చు యోహానును దేవుని దూతగాను, ప్రభువైన యేసును నిబంధన దూతగాను పేర్కొని దూతశబ్దముతో భక్తకోటికి మేల్కొలుపు కల్గించుచున్నాడు.

చివరి ప్రవక్తగా మలాకీ వ్రాతకు గంభీరమైన ప్రాముఖ్యత కలదు. అయ్యో వారు దేవుని మాటలను పదే పదే విమర్శించుచు ఆత్మీయముగా హీనస్థితికి దిగజారిరి. అయితే ప్రభువు వారి విమర్శలను 12 సార్లు నమోదు చేసెను. కాని ప్రభువు నామమును స్మరించుచు ఆయననుగూర్చి చెప్పుకొను భక్తిగలవారికి తగిన బహుమానము నిచ్చుటకై వారి మాటలుకూడ జ్ఞాపకార్థ గ్రంథములో లిఖింపబడెను

www.doctorpaul.org

(3:16). మార్టిన్ లూథర్ యోహాను 3:16 సంక్షిప్త సువార్తయని పేరిడెను. అట్లే మలాకీ గ్రంథమును సంక్షిప్త పాత నిబంధనయని పిలువదగును. మలాకీ 3:1 లోని దూత ఎవరు? యోహాను 1:23 లో నున్నట్లు అరణ్యములో ఎలుగెత్తిన శబ్దమీ బాప్తిస్మమిచ్చు యోహానే. మలాకీ తరువాత ప్రవచన స్వరము 400 యేండ్ల వరకు నిశ్శబ్దముగా నుండిన పిమ్మట తిరిగి ప్రభువుదూతద్వారా యూదయ అరణ్యములో మారుమ్రోగెను.

మలాకీ కాలములోని యాజకులు దురాశపరులై కేవలము భృతికొరకు పని చేయుచుండగా దేవుడైన యెహోవా "నేను తండ్రినైతే నాకు రావలసిన ఘనత ఏమాయెను ? నేను యజమానుడనైతే నాకు భయపడువాడెక్కడ ?" అని అడుగు చున్నాడని మలాకీ తన స్వరమును వినిపించెను. ప్రభువు తిరిగిరానున్న యీ దినములలో ప్రతి విశ్వాసి ఒర మలాకీవలే ఆయన "హఠాత్తుగా వచ్చును" (3:1), ఆయన అగ్ని వంటివాడు(3:2), వెండిని శోధించునట్లు శోధించును (3:3) అని హెచ్చరించి ప్రభువు బిడ్డలను తండ్రివైపు త్రిప్పుచు ఆయన మార్గమును సరాళముచేయు ఒక దూతవలె నుందురుగాక.

# మత్తయి సువార్త

ఒక యూదునిగూర్చి మరొక యూదుడు యూదులకు వ్రాసిన సువార్తే మత్తయి సువార్త. మత్తయి (దేవుని వరము) గ్రంథకర్త, అతని దేశస్థులు దాని చదువరులు, వారి రాజు దాని అంశము. అతని మొదటి పేరు లేవి. తండ్రి అల్ఫయి నివాసము కపెర్నహూము. ప్రభువుకు గొప్ప విందుచేసిన (లూకా 5:29) యీ భాగ్యవంతుడు గొప్ప త్యాగముతో సమస్తము విడిచి ప్రభువును వెంబడించెను.

"అబ్రాహాము కుమారుడగు దావీదు కుమారుడైన యేసు క్రీస్తు" అనుచు యూదులదృష్టిని వారి అభిమాన సుప్రసిద్ధులు అబ్రాహాము దావీదులపైకి మళ్లించి పాత నిబంధనలోని 60 ప్రవచనముల నుదహరించి ప్రభువైన యేసు వారు శతాబ్దము లలో నిరీక్షించిన మెస్సీయ అని ఋజువుపరచెను. పాలస్తీనా దేశము అబ్రాహాము సంతానమునకు (ఆది 12) దాని సింహాసనమును దావీదు సంతానమునకు (2 సమూయేలు 7) వాగ్ధానము చేయబడెను గనుక వారి గర్భకోశములనుండి వచ్చిన యేసు ప్రభువు ఆ వాగ్దానములకు వారసుడు. దావీదు

www.doctorpaul.org

కుమారుడుగా ఆయన రాజు. అబ్రాహాము కుమారుడుగా ఆయన బలి (రక్షకుడు). రాజును అంశముగా గల యీ గ్రంథములో రాజ్యము అనుమాట 55 సార్లు, పరలోకరాజ్యము అనుమాట 32 సార్లు వచ్చును.

సంఖ్యామానమునుబట్టి చూడగా యిది బైబిలులో నలుబదియవ పుస్తకము. నలుబది అనే సంఖ్య పరీక్షను (పరిశోధన) చూపును. ఇశ్రాయేలుకు నిజమైన రాజు మెస్సీయను సశరీరుడుగా ప్రత్యక్షపరచి పరీక్షపెట్టగా వారు దానిలో ఓడిపోయి తొట్రు పడిరి. అయితే వారి తొట్రుపాటు (సిలువవేయుట) వలన లోకమునకు రక్షణ కలిగెను (రోమా 11:12). మత్తయి 5–7 అధ్యాయములలో నున్నది రాజు స్వయముగా ప్రజలకు విడుదల చేసిన తన రాజ్యాంగ చట్టము. ఇందులో ప్రకటింపబడినది రాజ్యసువార్త. ఇప్పుడు మనము ప్రకటించునది కృపాసువార్త. తేడా అపారము.

# మార్కు సువార్త

దీని గ్రంథకర్త మార్కు అను మారుపేరుగల యోహాను (అపొ.కా. 15:37). ఇతడు పేతురుద్వారా ప్రభువులోనికి వచ్చెను (1 పేతురు 5:13). వీనికి యెరూషలేములో పెద్ద యిల్లు గలదు (అపొ.కా. 12:12). అది యెరూషలేములోని విశ్వాసుల కూడిక గృహము. 14:51 లోని పడుచువాడు మార్కు అని పలువురి అభిప్రాయము. లూకా వలే యితడును అపొస్తలుడు కాదు. బర్నబాకు మేనల్లుడు (కొలస్స. 4:10) గనుక పౌలుకు బర్నబాకు విభేదమురాగా మేనమామనే వెంబడించెను. అయితే చివరకు పౌలుకు ప్రయోజకుడయ్యెను (2 తిమోతి 4:11).

మార్కు ప్రభువును సేవకుడుగా చిత్రించెను. రాజ్య సువార్త బోధించుచు, స్వస్థపరచుచు మరణము వరకు సేవకుడుగా నుండెను. ఎవరైన రాజు వంశమును పరికించెదరుకాని సేవకుని వంశావళి ఎవరికి కావట్టును? అందుకే కాబోలు మార్కు ప్రభువుయొక్క వంశావళిని ప్రస్తావించలేదు. ప్రభువులోని సేవాగుణము మార్కును ఆకట్టుకొనెను. ప్రభువును గురించిన ప్రత్యక్ష కథనమును తన గురువైన పేతురు ద్వారా మార్కు సముపార్జించి తన సువార్తలో పొందుపరచెను. ప్రభువును గూర్చిన తన మధుర స్మృతులు పేతురు మార్కుతో పంచుకొనగా అటుపై మార్కు తన సువార్తను వ్రాసెనని అలెగ్జాంద్రియాకు చెందిన ఆదిమసంఘ నాయకుడు

www.doctorpaul.org

క్లెమెంటు చెప్పెను. మత్తయి ప్రభువు ప్రసంగమునుగూర్చి మూడు అధ్యాయములు పట్టునంత వ్రాయగా మార్కు అసలు దీనిని పట్టించుకోనేలేదు. సేవకునికి ప్రసంగములతో నిమిత్తమేమి? అయితే క్రియకు ప్రాధాన్యతనిచ్చిన మార్కు 20 సూచక క్రియలను సవివరముగా పేర్కొనెను.

ప్రభువు నేడు మనతో ఉండి మనతో కలిసి పనిచేయుచున్నాడు (మార్కు 16:20). ఆయన మనకు సహకారుడు. మనము ఆయన జతపనివారము (సేవకులము) (1 కొరింథీ. 3:9).

# లూకా సువార్త

సిరియా దేశములోని అంతియొకయకు చెంది వృత్తికి వైద్యుడైన లూకా వ్రాసిన ఈ సువార్త (Gospel) అనుమాట (Gospel)Good spell అను ఆంగ్లోసాగ్జన్ పదము నుండి పుట్టెను. దాని అర్థము శుభవర్తమానమనియు శుభ చరిత్ర యనియు గలదు. కావున లూకా సువార్త అనగా లూకా వ్రాసిన శుభ చరిత్ర యని చెప్పవచ్చును. బైబిలు పుస్తకములను వ్రాసిన దాదాపు 40 మందిలో లూకా ఒక్కడే అన్యుడు (గ్రీసు దేశస్థుడు). లూకా వైద్యుడు మాత్రమేగాక చరిత్రకారుడును, చిత్రకారుడునై యుండెను. ఇతని చిత్రములు కొన్ని చర్చి భవనములలో చూచినట్లు ఆదిమ సంఘ నాయకులు చెప్పిరి. ఇన్ని వరములు కల్గినవాడు కనుకనే తన శుభచరిత్రను ఇంత మనోజ్ఞముగా చిత్రించెను. లూకా ప్రభువు సేవలో పౌలు జతపనివాడు. (2 తిమోతి 4:11).

గ్రీకు దేశస్థులు జ్ఞాన పిపాసులు. పూర్ణవ్యక్తులకొరకు ఆరాటపడెడివారు. ఇట్టి జిజ్ఞాసగల గ్రీకులకు నశించిన మనుష్యజాతిని ఉద్ధరించెడి పరిపూర్ణ మానవుడు ప్రభువైన యేసు క్రీస్తు అని చూపుటకు లూకా తన సువార్తను వ్రాసెను. పరిపూర్ణ మానవుని లూకా మనుష్యకుమారుడని పేర్కొనెను. దేవుని కుమారుడు మనుష్య కుమారునిగా అవతరించి పాపికి రక్షకుడాయెను. మత్తయి యూదులకు, మార్కు రోమీయులకు వ్రాయగా లూకా గ్రీసు దేశస్థులకు వ్రాసెను. తప్పిపోయిన కుమారుడు, జక్కయ్య, మల్కు చెవి అతుకుట, సిలువమీది దొంగ మున్నగువాటిని లూకా ఒక్కడు మాత్రమే వ్రాసెను. యెరూషలేమునుచూచి యేడ్చుట, మోకాళ్లూని ప్రార్థించుట, చెమట గొప్ప రక్తబిందువులవలే పడునట్లు వేదనపడుట యివన్నియు లూకా ప్రత్యేకముగా పేర్కొనిన దైవ మానవుని మానవత్వపు చిహ్నములు.

www.doctorpaul.org

# యోహాను సువార్త

ధన్యదంపతులైన జెబదయి, సలోమీల కుమారుడును బేత్సయిదా నివాసియు నైన యోహాను గ్రంథకర్త. అతడు తనను "యేసు ప్రేమించిన శిష్యుడ"ని పేర్కొని ప్రభువుప్రేమపై ఆధారపడిన పరమార్థజ్ఞాని. మూలపదము "విశ్వసించు" 98 సార్లు తటస్థించును. అయితే విశ్వసించవలసినదేమిటి ? ప్రభువైన యేసు దేవుని కుమారుడని. ఆయన దైవత్వమును నిరూపించుట దీని ముఖ్య ఉద్దేశము. బేత్లెహేము పశువుల తొట్టిలో పరుండినవాడే సమస్తమును సృష్టించినవాడు ఆయనే పరమదేవుడైయుండి దేవుని కుమారుడుగా కృపాసత్యముల సంపూర్ణతను తన శరీరమందుముద్చుకొని మనుష్యులమధ్య నివాసమేర్పరచుకొనెను. "నేనే" అని ప్రభువుచేసిన 7 ఉద్ఘాటనలు ఆయన దైవత్వమును స్థాపించును. నేనే ఆయనను (18:5) అని ప్రభువైన యేసు చేసిన ప్రకటన నిర్గమకాండము 3:14 లోని నేను ఉన్నవాడను అనిన యెహోవా దేవుని ప్రకటనకు సమానము. కనుక యేసే యెహోవా. నేనే జీవాహారము (6:35). నేనే లోకమునకు వెలుగును (8:12). నేనే ద్వారమును (10:7). నేనే మార్గమును సత్యమును, జీవమును (14:6). నేను నిజమైన ద్రాక్షవల్లిని (15:1). ఇవన్నియు సాటిలేని దైవత్వపు మేటి నిరూపణలు.

యోహాను వ్రాసిన సువార్త ప్రభువును మనము విశ్వసింపవలెననియు, మూడు పత్రికలు మనము ప్రేమింపవలసినవాడనియు, ప్రకటన గ్రంథము మనము ఎదురుచూడవలసినవాడనియు తెలుపును. ఇందులో ఎనిమిది సూచకక్రియలు గలవు. అవన్నియు ప్రభువుమాటతో జరిగినవే. ఔను ఆయనది మహత్తుగల మాట. (హెబ్రీయులకు. 1:3)

# అపొస్తలుల కార్యములు

ప్రభువైన యేసు పల్కిన చివరి మాటలు గొప్ప ఆజ్ఞగా (Great commission) పేరొందెను. సర్వలోకమునకు వెళ్లి సర్వసృష్టికి సువార్తను ప్రకటించుట ప్రభువు యొక్క గొప్పనియామకము. ఈ గొప్ప ఆజ్ఞ నిర్వహణకు ఆయన ఒక గొప్ప వ్యక్తిని వారికనుగ్రహించెను. ఆయనే పరిశుద్ధాత్ముడు. ఈ గ్రంథములో పేతురు మరియు పౌలు అను యిద్దరు అపొస్తలులు చేసిన కార్యములు ముఖ్యముగా

www.doctorpaul.org

లిఖింపబడెను. దీనిని అపొస్తలులు కార్యములు అనుటకన్న పరిశుద్ధాత్మ కార్యములు లేక పునరుత్థానుడైన ప్రభువు కార్యములు అనినచో సముచితముగానుండును. సంఘారంభ దినములలో దీనిని పరిశుద్ధాత్మ సువార్తయను పేరుండెను.

బైబిలులో యిది అసంపూర్ణ గ్రంథము. ఎందుకనగా పునరుత్థానుడైన ప్రభువు ఆనాటినుండి నేటివరకు నిరవధికముగా తన కార్యములను జరిగించుచునే యున్నాడు. సాక్షులు మరియు సాక్ష్యము అనుమాట 30 పర్యాయములు వచ్చును. పరిశుద్ధాత్మ పేరు డెబ్బదిసార్లు వచ్చును. మీరు నాకు సాక్షులైయుందును అనునది దీని ముఖ్యాంశము. లూకా వ్రాసిన యీ గ్రంథములో స్థానికసంఘముల నిర్మాణ చరిత్ర గలదు. పౌలు యీ సంఘములలో కొన్నిటికి లేఖలు వ్రాసెను. వాటిలో సంఘసత్యము, సంఘక్రమముగలదు. ఈ గ్రంథము యెరూషలేమునందు (మత కేంద్రము) సువార్త ప్రకటనతో ప్రారంభమై రోములో (రాజకీయ కేంద్రము) సువార్త ప్రకటింపబడుటతో ముగియును. పరిశుద్ధాత్మ ఆగమనము (2) పేతురు మొదటి ప్రసంగముతో 3000 మంది రక్షింపబడుట పెంతెకొస్తు నాటి ముఖ్య సంభవములు. ప్రభువు ఆనాటి నుండి (2:47) నేటివరకు రక్షింపబడినవారిని తన సంఘమునకు చేర్చుచునేయున్నాడు, మొదటి యేడు అధ్యాయములలో పేతురును ఎనిమిదవ అధ్యాయములో ఫిలిప్పును తొమ్మిదినుండి చివరివరకు పౌలును పరిశుద్ధాత్మ చేతిలోని పనిముట్లు.

# రోమీయులకు వ్రాసిన పత్రిక

పౌలుయొక్క గొప్పవ్రాతయైన దోమాపత్రిక పత్రికలన్నిటిలో మొదటి స్థాన మందుంచబడినది. నాలుగు సువార్తలు ప్రభువుచేసిన కార్యములను, పల్కిన మాటలను వివరించుచుండగా ఈ పత్రిక ఆయన మరణముయొక్క ప్రాముఖ్యతను వివరించుచున్నది. క్రీస్తుయేసుయొక్క సువార్త ఒక వాస్తవము మాత్రమేకాదు, వాస్తవము కంటే ఘనమైనది. అది జీవింపదగిన వాస్తవము. జీవింపజేయు వాస్తవము. క్రీస్తుయేసునందలి విమోచనము ద్వారా ఉచితముగా నీతిమంతుడుగా తీర్చబడిన వాడు దానికి తగినట్లు నడుచుకొనుజీవితమే సువార్తఫలము. సువార్తఫలము జీవితములో లేనిచో ఆ జీవితములోనికి సువార్త రాలేదు.

ఈ పత్రిక ముఖ్యాంశము దేవుని సువార్త. క్రైస్తవ్యపు కేంద్ర సత్యములు యిందు పూర్ణముగా వివరించబడెను. రోమా పౌరత్వము, గ్రీకు సాహిత్యము,

www.doctorpaul.org

హెబ్రీయుల మతనిష్ట, గమలియేలు శిష్యరికము, పరిసయ్యుని కార్యదీక్ష మేళవించిన పౌలు ఒక్కడే దేవుని సువార్తనుగూర్చిన వేదాంతము వ్రాయగల సమర్థుడు. ఈ గొప్ప పత్రిక కొరింథులోని గాయి అను సంపన్నుని యింట (16:23) నుండి వ్రాసి "ఫీబే" అను విధవరాలిద్వారా రోమా సంఘమునకు పంపెను. గొప్ప సిద్ధాంత ధననిధిని ఒక బలహీన విధవరాలి కప్పగించుట చూడగా ఆమె ఎంత నమ్మకస్థురాలో తెలియుచున్నది. ఈ పత్రికలోని మొదటి పదకొండు అధ్యాయము లలో మహోన్నతమైన సిద్ధాంతముగలదు. పన్నెండునుండి పదునారువరకు సిద్ధాంతము ఆచరణలోనికి వచ్చుటనుగూర్చియున్నది. యుగములలో సమాధానము దొరకని ప్రశ్న (యోబు 9:2) – మనుష్యుడు దేవునియెదుట నీతిమంతుడెట్లు కాగలడు ? ఈ మహా ప్రశ్నకు సవివర సమాధానమే రోమా పత్రిక. పౌలు తన దీర్ఘ ప్రసంగమునకు గైకొనిన పాఠ్యాంశము – 1:16, 17. సువార్త . . . నమ్ము ప్రతివానికి . . . రక్షణ కలుగజేయుటకు దేవుని శక్తి. నీతిమంతుడు విశ్వాసమూలముగా జీవించును.

# కొరింథీయులకు వ్రాసిన మొదటి పత్రిక

గ్రీసు దేశములో కొరింథు ప్రాముఖ్య నగరము. ఆనాటి అంతర్జాతీయ వాణిజ్య కేంద్రము, పౌలుయొక్క పదునెనిమిది మాసముల సేవాఫలితముగా అచ్చట ముచ్చటైన స్థానిక సంఘమేర్పడెను గాని అనతికాలములోనే వ్యక్తి పూజలు మొదలై విశ్వాసులు పౌలును, అపొల్లోను, పేతురును తమకు శిరస్సులుగా ఏర్పరచుకొనిరి. ఈ శరీరస్వభావము వారిని శరీరానుసారులుగాజేసి అనేక అవాచ్య కార్యములపాలు జేసెను. ప్రభువు అను పేరు యీ పత్రికలో ప్రముఖముగా పేర్కొనబడెను. క్రీస్తు ఒక్కడే మన ప్రభువు అని గమనించినచో క్రైస్తవులలోని అనేక జాడ్యములంతరించి పోవును. లోకములో క్రీస్తు సంఘమున్నచో అది ఆశీర్వాదమేకాని క్రీస్తు సంఘములో లోకమున్నచో అది పెద్ద చేటు. పెద్ద సముద్రములో ఓడ తేలియాడుచుపోవుట మనోహరదృశ్యమేగాని ఓడలోనికి సముద్రము ప్రవేశించినచో అది ప్రాణాంతకమే! ఏ సంఘమునకైనను వర్గవిభేదములు గొడ్డలిపెట్టు. కొరింథులోని విశ్వాసులు నాల్గు వర్గములుగా విభాగింపబడిరి. పౌలు పార్టీ, అపొల్లో పార్టీ, పేతురు పార్టీ, నాల్గవది తటస్థవాదుల

www.doctorpaul.org

పార్టీ అనగా క్రీస్తు పార్టీ. తటస్థవాదులు పేరుకు మాత్రమే మేము క్రీస్తు వారమనుచుండిరిగాని వారుకూడా వాస్తవమునకు క్రీస్తు నడిపింపు క్రిందలేరు. అట్లుండినచో ఎంత మనోహరము ! క్రైస్తవ్యమునకు కేంద్రబిందువు క్రీస్తు. క్రైస్తవ సంఘమునకు శిరస్సు క్రీస్తు. క్రైస్తవులు క్రీస్తు పేరును ధరించుట కాదు, క్రీస్తును ధరించవలెను. పదమూడవ అధ్యాయములోని ప్రేమ ఎవరు? క్రీస్తే! క్రీస్తు ప్రేమ సమాజములలో ఏర్పడు సమస్త రుగ్మతలకు విరుగుడు. ఈ దిద్దుబాటు పత్రికలో ప్రభువు బల్లను గురించిన ప్రత్యక్షతయు సాటిలేని క్రైస్తవ మేటి సిద్ధాంతము పునరుత్థానము (15 అధ్యాయము) ఉండుట దరిద్రులకు ధననిధి దొరికినట్లే. ఆత్మీయముగా స్వల్పస్థితిలోగల కొరింథు వారికి అనేక వరములుండుట గమనార్హము. వరము పరిపూర్ణతకు చిహ్నముకాదు.

# కొరింథీయులకు వ్రాసిన రెండవ పత్రిక

మొదటి పత్రిక వ్రాసిన తరువాత కొందరు యూదా దుర్బోధకులు యెరూషలేమునుండి వచ్చి ప్రజలను పౌలుకు వ్యతిరేకముగా త్రిప్పిరి. పౌలు గర్వి, వదరుబోతు, శరీరరూపమునకు బలహీనుడు, ప్రసంగములు కొరగానివి, అసలు అపొస్తలుడేకాదు అనుచు పౌలునుగూర్చి చెడుగా ప్రచారముచేయుచుండిరి. ఈ లోపమును సరిచేయు టకు పౌలు తీతును పంపెను. తీతు తిరిగివచ్చి కొరింథీయులలో అత్యధికులు వాస్తవమునెరిగి పశ్చాత్తాపపడి పౌలువైపు తిరిగిరని తెలుపగ మిక్కిలి సంతసించి వారికి కృతజ్ఞతాపూర్వకముగా రెండవ పత్రికను వ్రాసెను. (పౌలు వ్రాసిన రెండవ పత్రిక పోయినది, ఇది మూడవ పత్రిక అనువారు కలరు.)

ఈ పత్రికలో పౌలు ఎక్కువగా స్వీయచరిత్రను వ్రాసికొనెను. ఇదివరకు ఎక్కడా చెప్పని క్రొత్త సంగతులను ఈ పత్రికలో చెప్పెను. (1) దమస్కులో గంప ద్వారా తప్పింపబడుట. (2) మూడవ ఆకాశమునకు కొనిపోబడుట. (3) అతని శరీరములో ఒక ముల్లు ఉండుట. (4) అసాధారణ శ్రమలు (11:23–27). "ఆదరణ" మరియు "పరిచర్య" అను మాటలు పదేపదే వాడబడెను.

అనేకులు భక్తుల శరీరములో ముల్లెందుకని అభ్యంతరపడెదరు. వాటిని భక్తుల ఆశీర్వాదము నిమిత్తమై దేవుడే అనుమతించెను. ముల్లుగల సేవకులు

www.doctorpaul.org

దేవునిపై పూర్తిగా ఆధారపడి ఆయనకొరకు ఘనకార్యములు జరిగించిరి. ఈ పత్రికలో క్రైస్తవ దాతృత్వమునుగూర్చి 8 మరియు 9 అధ్యాయములలో పౌలు ఎంతో సహజ సౌందర్యముగా చెప్పెను. దేవుడు ఆశీర్వదించగా దేవుని ప్రజలు అక్కరలో ఉన్న దేవుని పనివారికి, తోడి సహోదరులకు యివ్వగా వారు పరమునకు కృతజ్ఞతలు పంపెదరు. పైనుండి వచ్చిన వర్షము ఆవిరి రూపమున తిరిగి పైకి వెళ్లిన చందమున దేవుని ఆశీర్వాదము పైనుండివచ్చి మేలు కల్గించి తిరిగి స్తోత్రరూపమున పైకే వెళ్లు చున్నది. తనకు కలిగిన అతి శ్రేష్టమైన ప్రత్యక్షతనుగూర్చి 14 సంవత్సరములు దాచిపెట్టుట పౌలుయొక్క దీనత్వమునకు, స్వయోపేక్షకు చక్కని సాదృశ్యము (12 అధ్యాయము).

# గలతీయులకు వ్రాసిన పత్రిక

తన రెండవ మిషనెరీ యాత్రలో పౌలు గలతీయలో జబ్బుపడి ఆగిపోయెను. అయినను విరామమెరుగని అపొస్తలుని కార్యదీక్ష వలన గలతీయ మండలములో అనేక స్థానిక సంఘము లేర్పడినవి. అయితే యూదా మత బోధకులు విశ్వాసులను కలవరపరచి రక్షకుని నమ్మట మాత్రమేగాక ధర్మశాస్త్రపరమైన ఆచారములను గైకొంటేనేగాని రక్షణ కలుగదని బోధించి వారిలో కొందరు తిరిగి సున్నతి పొందునట్లు చేసిరి. పౌలు నిజమైన అపొస్తలుడుకాడని శిష్యులను సందేహపరచి పాత నిబంధనలోని యూదా క్రతువులకు శిష్యులను త్రిప్పుచుండిరి. క్రైస్తవ్యము యూదా మతము యొక్క ఊయలలో పెరిగినమాట వాస్తవమేగాని ధర్మశాస్త్రమునకు కృపకుగల గొప్ప వ్యత్యాసమును గుర్తించనిచో అదే యూదా ప్రభావము క్రైస్తవ్యమునకు సమాధిగా మారును.

ఐగుప్తు దాస్యమునుండి ఇశ్రాయేలును విడిపించుటకు దేవుడు మోషేను ఏలాగు లేపెనో అట్లే విశ్వాసులను యూదా మత కర్మకాండములనుండి విడిపించు టకు పౌలును లేపెను. అట్లే పదిహేను శతాబ్దముల పిమ్మట రోమా కర్మకాండముల నుండి విశ్వాసులను విడిపించుటకు దేవుడు మార్టిన్ లూథర్‌ను లేపెను. లూథర్‌కు యీ పత్రిక ఎంతో ప్రీతిపాత్రము. విశ్వాసము మాత్రమే పాపిని దేవుని కృపద్వారా నీతిమంతునిగా తీర్చును. ధర్మశాస్త్రము రాకపూర్వము 430 యేండ్లక్రిందట జీవించిన అబ్రాహాముకూడా విశ్వాసముద్వారా మాత్రమే నీతిమంతుడుగా తీర్చబడెనని పౌలు

www.doctorpaul.org

సోదాహరణముగా నిరూపించెను. క్రీస్తు సిలువ కార్య ప్రభావము నమ్మిన పాపిని పాపమునుండియు, పాపశక్తినుండియు, ధర్మశాస్త్రపు శాపమునుండియు, లోకము నుండియు, శరీరమునుండియు విడిపించును. క్రీస్తులో విశ్వాసికి నిజమైన స్వాతంత్ర్యము గలదు. ఈ స్వాతంత్ర్యము పాపము చేయుటకు అనుమతికాదుగాని పరిశుద్ధాత్మచేత నడిపించబడి ఆత్మఫలములను ఫలించుట కొరకైన నూతన జీవముయొక్క స్వేచ్ఛయైయున్నది.

# ఎఫెసీయులకు వ్రాసిన పత్రిక

ఇది రోమా చెరనుండి తాను స్థాపించిన ఎఫెసు సంఘమునకు పౌలు వ్రాసిన పరమోత్తమ పత్రిక. పౌలు పత్రికలన్నిటిలో దీనిని "అతి పరిశుద్ధ స్థలమును" పోలిన పత్రికగా వర్ణించెదరు. పౌలు 2 కొరింథీయులకు 12:2 లో మూడవ ఆకాశమునకు కొనిపోబడినట్లు తెలిపెను. తానక్కడ ప్రభువును నమ్మిన విశ్వాసుల యొక్క స్వాస్థ్యమును కన్నులార చూచెను. సంఘముయొక్క ఈ గొప్ప మహిమైశ్వర్యమును గూర్చిన మర్మము యుగములన్నిటిలో దాచబడి పౌలుకు ప్రతేకముగా బయలుపరచబడెను. తండ్రియైన దేవుడు సంఘమును సంకల్పించెను. అది ఏర్పడుటకు క్రీస్తు శ్రమపడెను. ఆ సంఘమునందే క్రీస్తు అత్యున్నతముగా మహిమనొందును. సంఘము అనగా ఒక గుంపు (ముఠా) కాదు. అది సజీవమైన క్రీస్తు శరీరము. అందులో దేవుని పరిశుద్ధాత్మ నివసించును. దానికి శిరస్సు క్రీస్తు. సంఘ సత్యమునకు ఎఫెసీ పత్రిక గుండెకాయ వంటిది. ఇశ్రాయేలీయులు భూసంబంధమైన దీవెనలకు మాత్రమే పాత్రులు, ఐతే క్రైస్తవులు పరలోకమునకు చెందిన ప్రతి ఆశీర్వాదమునకు పాత్రులే. మనము క్రీస్తునందు ఆశీర్వదింపబడితిమి (1:3). మనము క్రీస్తునందు ఏర్పరచబడితిమి (1:6). మనము క్రీస్తునందు కుమారులుగా దత్తత చేసికొనబడితిమి (1:5). మనము క్రీస్తునందు విమోచింప బడితిమి, క్షమింపబడితిమి (1:7). మనము క్రీస్తునందు మహిమ పరచబడితిమి (1:12). మనము క్రీస్తునందలి విశ్వాసముద్వారా ఆత్మచేత ముద్రింపబడితిమి (1:14). మనము క్రీస్తునందు బ్రతికింపబడితిమి (2:5). మనము క్రీస్తునందు లేపబడి పరలోకమందు కూర్చుండబెట్టబడితిమి (2:7).

ఇంతటి ఐశ్వర్యవంతులైన క్రైస్తవులు ఎందుకు భిక్షగాండ్రవలే నున్నారు ? సంఘమునుగూర్చిన సత్యమును ఎరుగకుండినందుననేగదా. దేవుని కృపామహిమకు

www.doctorpaul.org

కీర్తి కలుగునట్లు చచ్చిన కుక్కవంటి మనకు సంక్రమించిన పరలోకపు ఆశీర్వాద ఐశ్వర్యములకు తగినట్లు దేవుడు ముందుగా సిద్ధపరచిన సత్క్రియలు చేయుచు (2:8) దేవునికుమారునిగూర్చిన జ్ఞానము (4:11) లో పూర్ణులమగుదుముగాక.

# ఫిలిప్పీయులకు వ్రాసిన పత్రిక

ఐరోపాలోని మొదటి సంఘమునకు పౌలు వ్రాసిన ఈ పత్రికను దేవుని గ్రంథమంతటిలో సౌందర్యమైన, ప్రియాతిప్రియమైన ఆత్మీయ కళాఖండముగా పరిగణించెదరు. ఫిలిప్పీలోని సంఘము ఆత్మీయముగా పరిణతి చెందిన సంఘము. అందుకే కాబోలు ఈ పత్రికలో పాపము అను మాట కనబడదు. మరియు ఇందలి సంఘము అధ్యక్షులచేతను (సంఘ పెద్దలు), పరిచారకులచేతను పర్యవేక్షింప బడుచుండెను. ఇది మాదిరి సంఘము. చెరలోనున్న అపొస్తలునికి సహోదర ప్రేమయొక్క పరిమళ సువాసనగా కొంత యీవిని పంపిరి. వారికి కృతజ్ఞత తెలుపుకొనుచు వారి యీవి దేవునికి యింపైన సువాసనగా నుండెనని ప్రోత్సహపరచుచు వ్రాసిన పత్రిక. క్రైస్తవ ఆనందము ఇందలి ముఖ్యాంశము. ఆనందము గగనవీధులలో కిలకిలరావము చేయుచు విహరించు ఒకానొక అపురూపమైన పక్షి. అది క్రైస్తవుని పెంపుడు పక్షి. అది క్రైస్తవుని సొత్తు. దాని కమనీయ గాత్రమునకు మానవమాత్రులు ముగ్ధులగు చున్నారు. క్రీస్తును నమ్మిన విశ్వాసి కడుపేదరికమైనను కడుంగడు శ్రమాహింసలనైనను సంతోషముతో స్వీకరించి వాటియందే ఆనందించుచుండును. ఫిలిప్పీ సంఘము శ్రమానుభవములో జన్మించినది. పౌలును సీలయు కాళ్ళకు బొండలు బిగింపబడి వీపులు బ్రద్దలగునట్లు కొట్టబడి చెరసాలలో వేయబడిరి. వారి కడుపులు ఆకలితోను, శరీరము దెబ్బలతోను, చలితోను వణకుచుండెను. కాని ఆత్మలోని ఆనందము ఆపలేనిదై సంతోషగానము చేయగా కఠిన హృదయుడు చెరసాల నాయకుడు కరిగింపబడి రక్షింపబడెను. (అపో.కా. 16). శ్రమలోని క్రైస్తవ సునాదము పొరుగు పాపులపై మెండు ప్రభావము కల్గియుండును.

క్రీస్తు జీవము శ్రమను జయించు జయగీతము పాడించును. రెండవ అధ్యాయము క్రీస్తు మనకు మాదిరియై యుండెనని చూపును. క్రీస్తు నమ్రతతోను దీనత్వముతోను దేవునికి విధేయుడై మరణమువరకు నమ్మకముగా ఉండెను.

www.doctorpaul.org

మూడవ అధ్యాయము క్రైస్తవ నిరీక్షణకు గురి క్రీస్తేనని తెలుపును. నాల్గవ అధ్యాయము క్రీస్తు క్రైస్తవుని శక్తిగా చూపును. సంఘములో ఏక మనస్సులేనివారు క్రీస్తు మనస్సుతో మెలుగుట చేతనే ఐక్యత నెలకొనును. లేనిచో విభజన తప్పదు.

# కొలస్సయులకు వ్రాసిన పత్రిక

ఇది రోమా చెఱసాల (మొదటిసారి) నుండి పౌలు వ్రాసిన పత్రిక. ఎఫెసుకు సుమారు 100 మైళ్లలోగల కొలస్సై పట్టణమును పౌలు ఎన్నడు దర్శించలేదు. ఈ సంఘము ఎపఫ్రా పరిచర్య ద్వారా స్థాపించబడి యుండవచ్చును.

కొలస్సై సంఘములోనికి ఒక దుర్బోధ ప్రవేశించినది. అది నేడు గ్నోస్టిసమ్ (Gnosticism) అని పిలువబడుచున్నది. దీనిని బోధించువారు నేడుకూడ అక్కడక్కడ కనపడుదురు. వీరి బోధ – నిజమైన దైవత్వముకంటే యేసుక్రీస్తు కొంచము తక్కువ వాడు. విమోచనమునకు ఒక్క యేసుక్రీస్తు కార్యము మాత్రమే పరిపోదు. దేవత్వము మానవత్వము ఎన్నడు కలసి వసించవు, మహా పరిశుద్ధుడైన దేవునికిని పాపభూయిష్టమైన భూమికిని మధ్యలో కెరూబులు, సెరాపులతో కూడిన కొంత దూతగణము కలదు. వీరిలో యేసుక్రీస్తు ఒకడు–ఈ విధమున వారు దేవ దూతారాధన జరిగించెదరు.

దీనిని ఖండించు నిమిత్తమై పౌలు యీ పత్రికను వ్రాసి ఎపఫ్రా ద్వారా కొలస్సైకి పంపెను. యేసుప్రభువుయొక్క నిత్యమహిమ అనగా నరావతారమునకు పూర్వము ఆయనకు తండ్రితో సమానముగా ఉండిన దైవత్వము, సమస్తసృష్టికి సృష్టికర్తయు, ఆధారభూతుడును, సంఘమునకు ఆయనే శిరస్సు అను మున్నగు సత్యములు కొలస్సై 1:15–23 లో ఉన్నంతగా లేఖనములలో మరొకచోట కానవావు. గ్నోస్టిసమ్ జ్ఞానమును బోధించునట్లుగా కనబడు అబద్ధము. దీనిని నమ్మువారు అనేకులుకలరు. దీనికి జవాబుగా బుద్ధిజ్ఞానముల సర్వసంపదలు, దేవత్వముయొక్క సర్వ పరిపూర్ణత సశరీరముగా క్రీస్తునందుండెనని తేల్చిచెప్పెను. ఎఫెసీ పత్రిక "క్రీస్తుయొక్క సంఘము"నుగూర్చి చెప్పుచుండగా కొలస్సై పత్రిక "సంఘముయొక్క క్రీస్తు"ను గూర్చి చెప్పుచున్నది.

www.doctorpaul.org

# థెస్సలొనీకయులకు వ్రాసిన మొదటి పత్రిక

పౌలు వ్రాసిన పత్రికలన్నిటిలో మొట్టమొదటిది. కొరింథునుండి వ్రాసి తిమోతి ద్వారా థెస్సలొనీకకు పంపెను. థెస్సలొనీక సంఘము పౌలు ప్రయాసముతో స్థాపించబడెను. ప్రభువుయొక్క రెండవ రాకడ యిందలి ముఖ్యాంశము. క్రైస్తవుని నిరీక్షణ ప్రభువు రాకడేగాని మరణముగాదు. ఈ మొదటి పత్రికలోని మొదటి అధ్యాయములో నూతన విశ్వాసికి ప్రేరణ కల్గించు నిరీక్షణ గలదు. రెండవ అధ్యాయములో నమ్మకమైన పనివానికి ప్రోత్సాహము కల్గించు నిరీక్షణ, మూడవ అధ్యాయము భక్తకోటిని పవిత్ర పరచు నిరీక్షణ, నాల్గవ అధ్యాయములో దుఃఖార్తులైన విశ్వాసులకు ఆదరణ కల్గించు నిరీక్షణను చూచెదము.

చనిపోయిన విశ్వాసుల కేమి సంభవించునో థెస్సలొనీకలోని విశ్వాసులకు గ్రహింపు లేదు. మరియు కొందరికి ప్రభువు రాకడను గూర్చియే మాత్రము తెలియదు గాన అజాగ్రత్తగా నడుచుకొనుచుండిరి. ఇట్టి లోపములను సంరించుటకై పౌలు యీ పత్రికను వ్రాసెను. దీనిలో నూతనత్వము, వెచ్చదనము, శక్తి ఉట్టిపడును. థెస్సలొనీకకు వ్రాసిన రెండు పత్రికలలోని విశ్వాసము, ప్రేమ, నిరీక్షణలు ఎంతో మనోహరముగా కనిపించును. ప్రభువు రాకడ విశ్వాసులను రానున్న ఉగ్రత నుండి తప్పించును (1:10). అపొస్తలునికి ఆనందము అతిశయ కిరీటము నిచ్చును (2:19). పరిశుద్ధులను దేవుని యెదుట అనింద్యముగా నిలువబెట్టును (3:13). ప్రస్తుత దుఃఖమును ఉపశమింపజేసి ఓర్పును పెంపుజేయును (4:17). ప్రభువు రాకడ పరిశుద్ధుల ఆత్మ, జీవ, శరీరములకు పరిపూర్ణత గల్గించును.

# థెస్సలొనీకయులకు వ్రాసిన రెండవ పత్రిక

మొదటి పత్రికవలె ఇదియు కాపరి పత్రిక. ఆయన నిశ్చయముగా వచ్చునని మొదటి పత్రిక చెప్పుచుండగా ఆయనవచ్చువరకు పనిచేయుచు ఎదురుచూచు చుండవలెనని రెండవ పత్రిక చెప్పుచున్నది. నూతన నిబంధనలోని 260 అధ్యాయములలోను 318 సార్లు ప్రభువు రెండవ రాకడ ప్రస్తావించబడెను. గనుక పరిశుద్ధాత్మునికీ అంశమెంత ప్రాముఖ్యమైనదో తెలియుచున్నది. మొదటి పత్రిక ప్రభువు తన ప్రజల కొరకు వచ్చునని తెలుపుచుండగా రెండవది ప్రభువు తన

www.doctorpaul.org

ప్రజలతో వచ్చునని తెలుపుచున్నది. ఈ రెండు సంభవములకు మధ్య ఏడు సంవత్సరముల వ్యవధి ఉండును. ప్రభువు రెండవ రాకడలో రెండు దశలుండును. మొదటి దశలో అదృశ్యముగాను, రహశ్యముగాను వచ్చి సంఘమును ఎత్తికొని పోవును. సంఘము యెత్తబడిన తరువాత శ్రమలకాలము ప్రారంభమగును. ఈ కాలములో యూదులు పాలస్తీనాను పూర్తిగా స్వాధీనము చేసికొనుటయు అన్యజనాంగములు వారి పైకి విరోధముగా లేచుటయు క్రీస్తువిరోధి లేచి ప్రపంచ నియంతయగుటయు యూదులను హింసిచుటయు జరుగును.

"ప్రభువుయొక్క దినము" సంఘము యెత్తబడిన తరువాత ప్రారంభమగును. మొదటి పత్రికలో నిద్రించిన పరిశుద్ధులు ప్రభువు రాకడలో ఎత్తబడుదురని వివరించెను. రెండవ పత్రికలో సజీవులైన పరిశుద్ధులు ప్రభువుయొక్క దినపు శ్రమలలో పాలు పొందరని వివరించును. క్రీసు విరోధి లోకములో చెడుమాటలను, చెడు క్రియలను పురికొల్పుచుండగా ప్రభువు బిడ్డలు సత్కార్యములను సద్వాక్యములను చేపట్టవలసి యున్నారు.

# తిమోతికి వ్రాసిన మొదటి పత్రిక

తిమోతికి వ్రాసిన రెండు పత్రికలు, తీతు పత్రిక–యీ మూడింటికి కాపరి పత్రికలని పదునెనిమిదవ శతాబ్దమున పేరిడిరి. డెబ్బదియేండ్ల ప్రాయములో పౌలు వీటిని వ్రాసి పంపెను. తిమోతికప్పుడు సుమారు ఇరువది రెండేండ్లు. కొరింథునుండి వ్రాసెను. తిమోతి ఎఫెసు సంఘములో కాపరి బాధ్యతలను కల్గియుండగా తప్పు సిద్ధాంతము నెదుర్కొనవలసి వచ్చెను. సంఘక్రమమును గూర్చియు సంఘ పెద్దల క్రమమునుగూర్చియు వ్రాయవలసి వచ్చెను. ఇది యువకుని ప్రోత్సహించు ధ్యేయముతో వృద్ధుడు వ్రాసి పంపిన లేఖ.

సువార్తకు భంగము వాటిల్లకుండ యౌవనేచ్ఛలను విసర్జించుమని హెచ్చరించి దైవజనుని ధ్యేయముగా నీతిని, భక్తిని, విశ్వాసమును, ప్రేమను, ఓర్పును సంపాదించుకొనుమని హితవు చెప్పెను. తిమోతి అనగా "దేవునిచే ఘనపరచబడెను." ఈ పత్రికను ఐదు భాగములుగా విభజించవచ్చును. సంఘక్రమమును గూర్చిన 5 ప్రాముఖ్య అంశములు ఈ భాగములలో చూడవచ్చును. జీవముగల దేవుని సంఘములో ఆరోగ్యకరమైన క్రైస్తవ సిద్ధాంతము

www.doctorpaul.org

ఉండవలెను (1 అధ్యాయము). సంఘప్రార్థన నియమావళి (2, 3 అధ్యాయములు). అబద్ధబోధకులను గూర్చిన జాగ్రత్త (4 వ అధ్యాయము) విధవరాండ్రను గూర్చిన నియమము (5 వఅధ్యాయము).

క్రైస్తవ పని, వారి సంఘ పెద్దల (కాపరుల) బాధ్యతలు 4, 5, 6 అధ్యాయములలో పొందుపరచబడియున్నవి, అవి వారి ఆత్మీయ విధులు. క్రైస్తవ జీవితము విశ్వాస పోరాటము. ఆ పోరాటము మంచిదైతే దాని అంతము మహిమ. ఇప్పటి జీవితము రాబోవుదానికి పునాది. ఐతే నిజమైన దేవునియందలి భయభక్తులు ఇప్పటి, రాబోవు జీవితాలకు ప్రయోజనకరము.

# తిమోతికి వ్రాసిన రెండవ పత్రిక

చెరసాలలో నుండినవారు వారి ప్రియులు వ్రాసిన జాబులు చదువుకొని ధైర్యము వహించి దిగులు మానుట సహజము. ఐతే పౌలు చెరసాలనుండి ఇతరులను ధైర్యపరచుటకు జాబులు వ్రాయుట విశేషము. తిమోతికి మొదటి లేఖ వ్రాసి పౌలు కొరింథును విడిచెను. తీతును వెంటబెట్టుకొని క్రేతుకువెళ్లి అందలి సంగతులు క్రమపరచుటకై తీతును అక్కడ విడచెను (తీతు 1:5). తిరుగు ప్రయాణములో నికొపొలిలో ఉండగా బంధించబడి రోమాకు కొనిపోబడెను. తనకు బహు ప్రియమైన పుస్తకములను, అంగీని తీసుకొనుటకు సమయములేకుండ అకస్మాత్తుగా బంధింపబడెను. ఇది రెండవసారి బంధింపబడుట. మొదటిసారి అద్దె యింటిలో సౌఖ్యముగా నుండెను. ఇప్పుడు కఠినకారాగారములో ఏకాంతముగా బంధింపబడెను. మొదటి సారి త్వరలో విడిచి పెట్టుటకు అవకాశముండెను. ఇప్పుడైతే మరణశిక్షకు ఎదురు చూచుచుండెను. ఇట్టి స్థితిలో ఆఖరిగా వ్రాసిన యీ పత్రికలో దుర్బోధలనుండి కాపుదలకై తిమోతికి మార్గదర్శకములను వ్రాసి తుకికు ద్వారా పంపెను.

మొదటి పత్రిక వ్రాసినప్పుడు సంఘము ఆత్మీయముగా ఉన్నత స్థితియందుండెను. గనుక దానిని జీవముగల దేవుని సంఘముగా పేర్కొనెను (1 తిమోతి 3:15). ఐతే రెండవ పత్రిక వ్రాయునప్పటికి సంఘము ఆత్మీయత కోల్పోయెను. గనుక గొప్ప యిల్లుగా పేర్కొనెను (2 తిమోతి 2:20). ఇప్పుడు విశ్వాసిపై గొప్ప బాధ్యత పడెను. గొప్ప యిల్లుగా నుండిన క్రైస్తవ మతమును విడిచి నీతిని, విశ్వాసమును,

www.doctorpaul.org

ప్రేమను, సమాధానమును వెంటాడుటకై వెండి, బంగారు పాత్రలను బోలిన ప్రభువునకు ప్రార్థన చేయువారితో చేరవలసియున్నది. మంచి పోరాటము ముగించిన పౌలుకు నీతి కిరీటము వేచియుండెను. (2 తిమోతి 4:8).

# తీతుకు వ్రాసిన పత్రిక

తిమోతివలే తీతుకూడ పౌలుకు ఆత్మీయ కుమారుడు. తిమోతి యూదునివలే పెంచబడి సున్నతి పొందెను. తీతు పూర్తిగా అన్యుడుగనుక సున్నతి పొందలేదు. తిమోతి మొదటి పత్రిక వ్రాసిన కాలములోనే దీనిని కూడా వ్రాసెను. క్రేతులోని వారు 1:12 లో వ్రాయబడినట్లు సాధుపరచజాలనివారు. అయినను సమస్త మనుష్యులకు రక్షణకరమైన దేవుని కృప ప్రత్యక్షమైనందున క్రేతులో కొందరు రక్షింపబడి సమాజముగా రూపొందిరి. కాని వారిలో కొన్ని సంగతులు సరిలేనందున వాటిని క్రమపరచు బాధ్యత పౌలు తీతుపై మోపెను. అంతేకాక యితర పట్టణములలోని సంఘములలో పెద్దలను నియమించు అధికారమును అపొస్తలుడు తీతుకిచ్చెను. పెద్దల నియామకము అపొస్తలునికిగాని, అపొస్తలుని అధికారము పొందిన వానికిగాని మాత్రమే గలదు.

పెద్దల యోగ్యతలు జాగ్రత్తగా నిర్ణయింపబడెను. బహుభార్యా పరాయణులైన క్రేతీయులకు మాదిరిగా నుండవలసిన పెద్ద ఏకపత్నీ పురుషుడై యుండవలెను. పెద్ద గృహజీవితము (1:6) వ్యక్తిగత జీవితము (1:7, 8) నిందారహితముగా నుండదగును. సువార్త సాక్ష్యమునకు మణిదీపము నిందలేని గృహజీవనము. ఇంటగెలిచి రచ్చ గెలువవెనన్న తెలుగునానుడి క్రైస్తవ సాక్ష్యము విషయములో కూడా చెల్లును. సిద్ధాంతము నిత్యజీవితములో క్రియా సాధకము కావలెనని నమ్మినవాడు పౌలు. మన రక్షకుడైన దేవుని ఉపదేశమును జీవితములో అలంకరించుటయనగా (2:10) దేవునియందు విశ్వాసముంచినవారు సత్క్రియలను శ్రద్ధగా చేయుచుండుటయే. క్రియలేకుండ విశ్వాసమునుబట్టి కృపద్వారా రక్షింపబడిన క్రైస్తవుడు క్రైస్తవ జీవితములో సత్క్రియలు చేయుటకై వాటిని దేవుడు ముందుగానే సిద్ధపరచెను.

www.doctorpaul.org

# ఫిలేమోనుకు వ్రాసిన పత్రిక

ఇది పౌలు ఫిలేమోనుకు వ్రాసిన అంతరంగిక లేఖ. దేవుని గ్రంథాలయములో చోటుచేసికొన్నదంటే ఇదెంతో అమూల్యమైనదై యుండును. ఫిలేమోను కొలొస్సై సంఘములో ప్రాముఖ్య సభ్యుడు. ఇతని బానిస ఒనేసిము కొంత డబ్బు దొంగిలించి దానితో రోమాకు పారిపోయెను. రోమా చట్టప్రకారము యజమానిని విడిచి పారిపోయిన బానిసలు మరణశిక్షకు పాత్రులు. దేవుని కృపా ఏర్పాటును బట్టి రోములో ఒనేసిము పౌలును కలిసికొని సువార్తవిని రక్షింపబడెను. అటుపై పౌలుకు బహు వినమ్రతతో పరిచర్య జేయుచుండెను. మునుపు అప్రయోజకుడు యిప్పుడు ప్రయోజకుడయ్యెను. అయితే న్యాయసమ్మతముగా ఒనేసిము ఫిలేమోనుకు చెందినవాడు. గనుక అతని సేవలకు వాని యజమాని మాత్రమే పాత్రుడు. పౌలు ఇకపై ఒనేసిమును తన స్వప్రయోజనమునకు వాడుకొనక యజమానికప్పగింప నిశ్చయించెను. ఇందలి మూలపదము “చేర్చుకొనుము”. ఫిలేమోను దేవునికి, ఒనేసిము పాపికి, పౌలు రక్షకునికి సాదృశ్యము. చట్ట (ధర్మశాస్త్రము) రిత్యా ఒనేసిము (పాపి) మరణశిక్షకు పాత్రుడు. ఐతే రక్షకుడు కృపతో పాపిని కలుసుకొని దేవునియొద్దకు తెచ్చును. పాపి తీర్చవలసిన ఋణమును తాను చెల్లించిన క్రయధనపు లెక్కలో చేర్చి స్వీకరింపుమని నమ్మిన పాపి పక్షముగా రక్షకుడు విజ్ఞాపనము చేయుచుండెను. ఇప్పుడు దేవుని యింటిలో కుమారుడైన క్రీస్తుకెంతటి స్థానము కలదో ఆ స్థానము లోనికి పాపి చేర్చుకొనబడెను; కుమారుని నీతి పాపికారోపింపబడెను.

“అది నా లెక్కలోచేర్చుము” – సువార్త సందేశమిదియే. క్రీస్తు మ్రానుమీద తన శరీరమందు మన పాపములను భరించెను. ఫిలేమోను యికపై ఒనేసియు కల్గించిన నష్టమునుగూర్చి చింతింపక వాడు రక్షింపబడి తన యింట చేరినందుకై సంతసించుచుండును. దేవుని సంగతికూడా యింతే. ఇకమీదట ఒనేసిము ఫిలేమోనుకు సేవకుడే గాక క్రీస్తునందలి ప్రియసహోదరుడుకూడ ఆయెను.

# హెబ్రీయులకు వ్రాసిన పత్రిక

గ్రంథకర్త పేరు వ్రాయబడకపోయినను నిస్సందేహముగా పౌలే దీనిని వ్రాసెను. ఎందుకనగా రెండవ శతాబ్దివాడైన పాంటోనస్ దీనిని పౌలు వ్రాతగా

www.doctorpaul.org

పేర్కొనెనని యూసేబియస్ చెప్పెను. కాని మార్టిన్ లూథరువంటి మహా వ్యక్తులు కొందరు దీనిని పౌలు వ్రాతగా పరిగణించిరి.

యూదా మతనాయకులు తమకుగల మంచి దైవపద్ధతులు (ధర్మశాస్త్రము, వాగ్దానములు, అర్చనాచారాదులు, దేవదూతల పరిచర్య, దత్తపుత్రత్వము మున్నగునవి) యీ అల్ప క్రైస్తవులకు లేవుగదా యని అవహేళన చేయుచుండిరి. ఐతే దీని గ్రంథకర్త హెబ్రీ క్రైస్తవులను మూల పాఠములను విడిచి సంపూర్ణులు కండని హెచ్చ రించుచు క్రీస్తు దేవదూతలను సృష్టించినవాడుగనుక వారికంటే శ్రేష్టుడనియు, క్రీస్తు దేవదూతలచే ఆరాధింపబడువాడనియు, మోషే దేవుని ఇంటిలో నమ్మకస్థుడై యుండగా క్రీస్తు దేవుని ఇంటిపై అధికారము గలవాడుగనుక మోషేకంటే శ్రేష్టుడనియు, అహరోను తన పాపములకు ప్రాయశ్చిత్తము చేసికొనవలసియు మరియు తన పాపములకును ప్రజల పాపములకును యేటేట బలులర్పించ వలసియు ఉండగా క్రీస్తు పాపములేని పరిశుద్ధుడుగా సదాకాలము నిలిచియుండు ఒక్క బలిని అర్పించినందున అహరోనుకంటే శ్రేష్ఠుడనియు , ధర్మశాస్త్రముతో కూడిన పాత నిబంధన మనుష్యుని పాపములో బంధించియుండగా కృపతోకూడిన క్రీస్తు రక్తము వలననైన నూతన నిబంధన మనుష్యుని పాపమునుండి విమోచించి దేవుని బిడ్డగా జేసి మహిమలోనికి తెచ్చును గనుక పాతదాని కంటే క్రైస్తవులకు దొరికిన క్రొత్త నిబంధనయే శ్రేష్టమైనదనియు నిరూపించుటకు యీ మహోన్నత పత్రికను వ్రాసియుండెను.

ఇందలి మూలపదము "శ్రేష్ఠమైన". బలహీనమై వెనుకజారిన హృదయమునకు క్రీస్తుయొక్క వ్యక్తిత్వము, ఆయన జరిగించిన పనియొక్క విశిష్టతను గురించి సరియైన గ్రహింపునిచ్చుట యీ పత్రిక ముఖ్యోద్దేశము.

# యాకోబు వ్రాసిన పత్రిక

ప్రభువైన యేసుయొక్క సోదరుడు యాకోబు దీనిని వ్రాసెను. ప్రభువును నమ్మినవారు వినువారును, చెప్పువారునైయుండక "వాక్యము ప్రకారము ప్రవర్తించువారై" యుండునట్లు క్రియాపూర్వకమైన విశ్వాసమును యాకోబు భక్తకోటి కందించెను. ఇది క్రొత్త నిబంధనలోని సామెతల గ్రంథము. సోమరి విశ్వాసికి కొరడా చూపించును. హెబ్రీయులకు వ్రాసిన పత్రిక క్రైస్తవ సిద్ధాంతమును కల్గియుండగా

www.doctorpaul.org

యాకోబు పత్రిక సిద్ధాంతమును ఆచరణలోపెట్టు క్రియాత్మక క్రైస్తవ్యము (సజీవ విశ్వాసము) ను కల్గియున్నది. నిజమైన విశ్వాసము క్రైస్తవుని సత్క్రియకు రేపును. విశ్వాసము శ్రమలను సహించును, ఓర్చుకొనును. అయితే ఆ శ్రమలే విశ్వాసిలో సహనమును ఓర్పును పెంపొందించును. విశ్వాసము శోధనను అర్థము చేసికొనును. విశ్వాసము ఫలములను సండించును. విశ్వాసము క్రియలో ప్రతిబింబించును. విశ్వాసము ప్రభువును సిలువవేసిన లోకములో స్నేహమునకుగాని, నెయ్యమునకుగాని ఒప్పదు. విశ్వాసము ప్రభువు రాకడను ఓపికతో నిరీక్షించును.

హెబ్రీ భాషలోని యాకోబు అనునామము గ్రీకు భాషలోనికి జాకోబస్ అని రాగా అటు పిమ్మట ఆంగ్లములో జేమ్సుగా రూపాంతరము చెందెను. క్రొత్త నిబంధనలో నలుగురు యాకోబులుండిరి. అయితే దీని గ్రంథకర్త యెరూషలేము సంఘములో మూలస్తంభముగా ఎంచబడిన యాకోబు. ఈయన ప్రభువుయొక్క తమ్ముడు. యాకోబు పత్రికను "పరిశుద్ధజీవిత మార్గదర్శిని" అని పిలుతురు. రక్షింపబడుటకు (పాపక్షమాపణద్వారా తీర్పు తప్పించుకొనుటకు) మనుష్య క్రియకు తావులేదు (ఎఫెసీ. 2:9) గాని రక్షింపబడిన తరువాత విశ్వాసజీవితములో తప్పక సత్క్రియలతో దేవునికి మహిమ మనుష్యులకు మేలు కల్గించుట విశ్వాసి ముఖ్యవిధి.

# పేతురు వ్రాసిన మొదటి పత్రిక

పేతురు తన జీవితాంతమున బబులోను నుండి (5:13) యీ పత్రికను వ్రాసి పౌలు సహచరుడైన సిల్వానుచేత పంపెను. 1:2 లో గల ఆసియ ప్రాంత సంఘములన్నియు పౌలుచేతనే స్థాపించబడెను. ఈ పత్రిక వ్రాయబడిన సమయములో పౌలు చెరలో నుండెను. కనుక సిల్వాను పేతురుకు ఉపయోగపడెను. ఈ పత్రిక వ్రాయుటకు రెండు ముఖ్యకారణములు గలవు. (1) పౌలుకు పేతురుకు విభేదములుండెనని అక్కడక్కడ వినబడుచుండెను. (2) ప్రభువును నమ్మిన యూదులు అగ్నివంటి శ్రమలగుండా వెళ్లుచుండిరి గనుక దేవుని నానావిధమైన కృపతో (4:10) వారిని ఆదరించుటకును వ్రాసెను.

సువార్తలలో పేతురు రూపాంతరము పొందిన ప్రభువును చూచెను. పేతురు పత్రికలలో మనము రూపాంతరము పొందిన పేతురును చూచెదము. ఎందుకనగా నాలుగు సువార్తలలో కనబడుదుడుకు పేతురు యీ పత్రికలలో పరిపక్వముపొందిన అపొస్తలుడుగా కనబడుచున్నాడు.

www.doctorpaul.org

అమూల్యము అను పదము పేతురుకు ప్రియమైనది. అమూల్యమైన విశ్వాసము (1:7), అమూల్యమైన రక్తము (1:19), అమూల్యమైన ప్రభువు (2:4), అమూల్య మైన రాయి (1:6), అమూల్యమైన వాగ్దానములును గల్గిన క్రైస్తవులు ఆ నామము కొరకు శ్రమగాని అవమానము గాని పొందతగదా? (అపో.కా. 5:41). ఎన్నిక మరియు భవిష్యత్ జ్ఞానమునుగూర్చి చెప్పుటలో పేతురు దిట్ట (1:2, 20). ఈ చిన్న పత్రికలో శ్రమ అనుమాట 21 సార్లు కనబడుచు ప్రతి అధ్యాయములోను ప్రభువు శ్రమలు ప్రస్తావింపబడెను. అయితే యిదే పత్రికలో 26 సార్లు సంతోషము మహిమ అను మాటలు ప్రస్తావింపబడెను గనుక శ్రమ పడినవారి ముందు కాచుకొనియున్నదేమిటో తెలియుచున్నది.

# పేతురు వ్రాసిన రెండవ పత్రిక

మొదటి పత్రికను శోధనలు, శ్రమలుగుండా సాగివెళ్లు విశ్వాసుల ఓదార్పు కొరకు వ్రాసిన పేతురు రెండవ పత్రికను మలినమైన దురాశ కలిగి శరీరానుసారముగా నడుచుకొను దుర్నీతిపరులను భ్రష్టత్వమునకు దాసులై స్వకీయ దురాశల చొప్పున నడుచుకొను అబద్ధ ప్రవక్తలను, అబద్ధ బోధకులను హెచ్చరించుటకు వ్రాసెను. మొదటి పత్రిక కాలములో క్రైస్తవులు వెలుపటినుండి వచ్చు శ్రమల నెదుర్కొను చుండిరి. రెండవ పత్రిక కాలములో వారు లోపట బయలుదేరిన దుర్బోధనెదుర్కొన వలసి వచ్చెను. లోపటి ప్రమాదమును జయించవలసియున్నచో వారు "ప్రభువైన యేసుయొక్క కృపయందును, జ్ఞానమందును" వృద్ధిపొందవలసియుండెను. అబద్ధ బోధకులు "తమ్మును కొనిన ప్రభువును" విసర్జింతురు. ప్రభువు మనలను ఎట్లు కొనెను? తన అమూల్యమైన నిర్దోషమైన బలిరక్తముతో కొనెను. వారు దీనిని ఒప్పు కొనరు. ఎవరు పాప పరిహారమునకు సిలువ కార్యము ఒక్కటే మూలాధారమని ఒప్పుకొనరో వారు అబద్ధ ప్రవక్తలు, వారి శిష్యులు దుర్బోధకులు. వీరు క్రీస్తు దైవత్వమును సంఘముయొక్క శుభ నిరీక్షణయైన రెండవ రాకడను నమ్మరు. ప్రభువు వచ్చును. వెయ్యేండ్ల పాలన ఉండును. పూర్వము జలప్రళయముద్వారా భూమిపైగల పాపము నెట్లు తుడిచివేసెనో అట్లే రానున్న దినములలో అగ్ని ప్రళయము ద్వారా భూమి కాల్చి వేయబడునని పేతురు పరిశుద్ధాత్మ ప్రేరేపణతో వ్రాసెను. శాస్త్రజ్ఞులు చెప్పుచున్నదేమి? భూమిలో అనేకరకములైన పెట్రోలు వంటి

www.doctorpaul.org

చమురులు సహజవాయువులు నిక్షిప్తమై యున్నవి. అప్పుడప్పుడు వాటి ప్రభావము వలన అగ్ని పర్వతములు ప్రేలినప్పుడు మనము చూచుట లేదా? దేవుడు ఆజ్ఞయివ్వగా అవన్నియు రగులుకొని భూమియు దానితో పాటు పంచభూతములు మిక్కుటమైన వేండ్రముతో కాలిపోవును. అటు పిమ్మట నీతి నివసించెడి క్రొత్త భూమి ఆకాశములు ఏర్పడును. నీతి విరోధులారా జాగ్రత్త! రాకడలోని ఆలస్యము రక్షణార్థమైన దేవుని దీర్ఘశాంతమే!!

# యోహాను వ్రాసిన మొదటి పత్రిక

వృద్ధాప్యములోనున్న "అపొస్తలుడైన యోహాను ఎఫెసునుండి సకల పరిశుద్ధులకు వ్రాసిన సాధారణ పత్రిక. ప్రభువైన యేసు నామమును విశ్వసించిన వారు దేవుని కుటుంబములోని చిన్న పిల్లలుగా తండ్రియొక్కయు, కుమారునియొక్కయు సహవాసము గలవారై (1:4) నిత్యజీవము కల్గియుండినవారని (5:13) తెలుసుకొనుట యీ పత్రిక ముఖ్యోద్దేశము. వెలుగును, ప్రేమయు, జీవమునైయున్న దేవుని సహవాస మునందానందించుచు తన చిన్న పిల్లలు అట్టి మృదుమధురమైన దైవ ప్రేమానంద ములో ఆనందించవలెనని వ్రాసెను.

పాపము భయంకరమైన దేవుని తీర్పుకులోనగు సమస్యగా యిందు ప్రస్తావించ బడలేదు. అది తండ్రియెడల చిన్న బిడ్డ చేసిన అభ్యంతరము వలెను దానిని ఉత్తరవాది పరిచర్యద్వారా సులువుగా పరిష్కరింపబడి తెగిపోయిన సహవాసము పునరుద్ధరింప బడుటకు వీలైనదిగాను చూపబడెను. పాపము తండ్రి–బిడ్డల సంబంధమును త్రెంచివేయజాలదుగాని వారి మధ్యగల సహవాసమును మాత్రమే త్రెంచివేయును.

దేవుడు వెలుగు గనుక దేవుని పిల్లలు ఎప్పటికప్పుడు వెలుగులో తమ పాపములను కనిపెట్టి వాటిని ఒప్పుకొని ఒక్కసారే అర్పించిన క్రీస్తురక్తపు విలువ ద్వారా వాటి నుండి శుద్ధిపొంది తండ్రియొక్క సహవాసములో నిలిచియుందురు. దేవుడు ప్రేమ గనుక ఆయన పిల్లలు ప్రేమయందు నడుచుకొనుచు సహోదరులను ప్రేమించుదురు. వారు సహోదరులలో తండ్రిని, కుమారుడైన క్రీస్తును చూచెదరు. అప్పుడే వారు ప్రేమించగలరు. ప్రేమలేని హృదయము దేవుడు లేని హృదయము. దేవుడు జీవమైయున్నాడు. అది నిత్యజీవము. నూతన జన్మము పొందిన ప్రతి

www.doctorpaul.org

విశ్వాసి దేవుని జీవము పొందియుండును. దేవుని మూలముగా పుట్టినవాడు బుద్ధి పూర్వకముగా పాపమును అభ్యాసము చేయడు (3:9). దేవుడు నీతిమంతుడు (2:29). దేవుని మహిమార్థమై దేవుని బిడ్డ నీతియందు సాధకము చేసికొనును.

# యోహాను వ్రాసిన రెండవ పత్రిక

బైబిలంతటిలో ఇది ప్రత్యేకముగా ఒక స్త్రీ పేరిట వ్రాయబడిన పత్రిక. ఇది వ్యక్తిగతమైనదైనను సాధారణ పత్రికలలో ఒకటిగా ఎంచబడెను. యాకోబు పత్రిక, పేతురుయొక్క రెండు పత్రికలు, యోహాను మూడు పత్రికలు యూదా పత్రిక – ఈ ఏడును సాధారణ పత్రికలని నాల్గవ శతాబ్దమునుండి పిలువబడు చున్నవి. ఇందలి సహోదరి (అమ్మగారు) యొక్క వివరములు తెలియవు. దీనిని సత్యప్రేమల పత్రికయని పిలువవచ్చును. ఈ చిన్న పత్రికలో సత్యము అను మాట ఐదు సార్లును, ప్రేమ అను మాట నాలుగు సార్లును వచ్చును.

అబద్ధ బోధకులకు ఆశ్రయమివ్వరాదని శిష్యురాలిని హెచ్చరించుటకై వృద్ధుడు పనిగట్టుకొని వ్రాయవలసి వచ్చెను గనుక దుర్బోధకుల వల్ల ప్రమాదమెంత తీవ్రమైనదో గమనించగలము. ఈ సహోదరియు ఆమె పిల్లలును సత్యమును ఎరిగినవారుగా (1, 2 వ) ప్రసిద్ధికెక్కిరి. సత్యము నెరిగిన విశ్వాసులు అపొస్తలునికెంత ప్రియులో చూడుడి. 2 వ వచనములోని సత్యము ప్రభువైన యేసే.

దేవుని ఆజ్ఞ ప్రకారము మనము ఒకరినొకరము ప్రేమించుకొనవలసినదే. అట్లని అందరిని ప్రేమించవచ్చునా? అట్లు కూడదు. క్రైస్తవ ప్రేమయొక్క గురి క్రీస్తు మహిమ కొరకైనదిగా ఉండవలెను. ఆ దినములలో క్రీస్తు నరావతారమెత్తిన దేవుడు కాదనుచు సంఘములో సంచరించుచు యింటింట తిరుగు దుర్బోధకులు బయలుదేరిరి. శరీరధారియైన క్రీస్తు దేవుడు కాదనెడి వంచకులను (7 వ వచనము) ప్రేమించ వీలుపడదు. వారికి మన యింట ప్రవేశము లేదు. మన చేతులు వారికి నమస్కరింపవు. మన పెదవులు వారికి వందనములు చెప్పవు. మన కష్టార్జితమును పంచుకొనుటకు వారు పాత్రులు కారు. క్రైస్తవ ప్రేమ ఎన్నుకొనే ప్రేమ. క్రీస్తును మహిమ పరచుచు పాటుపడెడి సజ్జనులను ఎన్నుకొని వారినే ప్రేమించు జ్ఞానయుక్తమైన ప్రేమ. అబద్ధికులను కూడ ప్రేమించు క్రైస్తవులు లోకముయొక్క మెప్పుకోరువారే.

www.doctorpaul.org

# యోహాను వ్రాసిన మూడవ పత్రిక

ప్రియుడైన యోహాను తన మొదటి పత్రికలో మన సహవాసము తండ్రితోను ఆయన కుమారునితోను ఉన్నట్టిదని వ్రాసెను. రెండవ పత్రికలో అబద్ధ బోధకులతో మనము సహవాసము చేయరాదని వ్రాసెను. మూడవ పత్రికలో మనము సహోదరులతో సహవాసము నెరపుచుండవలెనని వ్రాయుచున్నాడు. ఈ పత్రిక కొరింథులోని సంపన్నుడును నమ్మకమైన సహోదరుడైన గాయునకు వృద్ధాప్యములోనున్న యోహాను ఎఫెసునుండి వ్రాసి దేమేత్రియుద్వారా పంపెను.

క్రొత్త నిబంధనలో గాయి అను పేరుగలవారు ముగ్గురు గలరు. (1) మాసిదోనియావాడైన గాయు (అపో. కా. 19:21). (2) దెర్బేవాడైన గాయు (అపో. కా. 20:4). (3) ఈ పత్రికలోని గాయు. ఇతడు యోహానుద్వారా ప్రభువులోనికి వచ్చెను. పౌలుద్వారా బాప్తిస్మము పొందెను (1 కొరింథీ. 1:1). ఈ పత్రికలో ఇద్దరు ప్రముఖ వ్యక్తులు గలరు. ఒకడు గాయు, రెండవవాడు దియొత్రెఫే. గాయు దయ, దాతృత్వము సహోదర ప్రేమ గల్గిన సత్యావలంభి. ఇతడు ప్రభువు నామముకొరకు ప్రయాసపడుచు పర్యటనలోనుండిన ప్రభువు సేవకులను చేర్చుకొని ఆతిథ్యమిచ్చి ప్రయాణ ఖర్చులతో సాగనంపెడి సత్యము కొరకైన జత పనివాడు. అయితే దియొత్రెఫే హృదయము గాయు హృదయమునకు పూర్తిగా భిన్నమైనది. ఇతడు యోహాను యొక్క అపొస్తలత్వమును నిరాకరించుచు ప్రభువు సేవకులను చేర్చుకొనకుండను, చేర్చుకొనువారినికూడ ఆటంకపరచుచు వారిని సంఘములో నుండి వెలివేసెడివాడు.

దియొత్రేఫే సంఘములో ప్రధానత్వముకోరు అధికార పిపాసి. ఆరంభము నుండి నేటివరకు దియొత్రేఫే వంటివారి వలన సంఘ సాక్ష్యము ఛిన్నాభిన్నమైనది. మొదట దియొత్రేఫే ఆత్మానుసారముగా ప్రారంభించియుండవచ్చును. కాలక్రమేణా అతని హృదయదృష్టి ప్రభువును విడిచి పదవిపై పడెను. చివరికతడు తన చెడు కార్యములనుబట్టి దేవుని చూచినవాడు కాడని (11వ) పేర్కొనబడుట కడువిచారము.

# యూదా వ్రాసిన పత్రిక

యూదా ప్రభువుయొక్క తమ్ముడు. యూదా పత్రిక, రెండవ పేతురు పత్రిక తలంపులోను, పదజాలములోను సారూప్యము గలవి. ప్రభువుయొక్క

www.doctorpaul.org

మరొక తమ్ముడైన యాకోబువలె ఇతడు అపొస్తలుడు కాదు. యూదా సామాన్య శిష్యుడైనను మండెడు ఆత్మయు, తీవ్రమైన ప్రవచన భారమునుగల వ్యక్తి. ఈ పత్రిక ఏదైన ఒక సంఘమునకుగాని, వ్యక్తికిగాని వ్రాయబడినదికాదు. క్రైస్తవు లందరికి వ్రాయబడినది. ఈ పత్రిక వ్రాయబడు సమయమునకు యూదా సోదరుడైన యాకోబు హతసాక్షియయ్యెను. మూడవ వచనమునుబట్టి చూడగా యూదా మొదట రక్షణనుగూర్చి తన పత్రిక వ్రాయనుద్దేశించెను. కాని తరువాత పరిస్థితులనుబట్టి తన అంశమును భ్రష్టత్వమును గూర్చిన హెచ్చరికగా మార్చెను. ఆదినుండి భ్రష్టత్వముయొక్క చరిత్రను వాటి మూల కారణములను పేర్కొనెను. దురాశపరులైన దూతలతో భ్రష్టత్వము ఆరంభమైనది. నాటి స్వనీతిపరుడైన కయీను, నీతిహీనులైన సొదొమ వారు, పేరాశపరుడైన బిలాము లోకాశలకు లొంగిన కోరహులు నేటి క్రైస్తవ సంఘము లోని భ్రష్టత్వమునకు కారకులైన వారి పితామహులు.

బైబిలులో ఈ పత్రిక ఒక్కటే మోషే శరీరమును గూర్చిన సంవాదమును, హనోకు ప్రవచన వాణిని పేర్కొనెను. ఇందు నిత్య జీవము (21) నిత్యపాశములు (6), నాత్యాగ్ని (7), పేర్కొనబడినవి. ప్రభువైన యేసుక్రీస్తుయొక్క సమాజములలో పాపమును, కడుపును ప్రేమించువారివలన భ్రష్టత్వము మొదటి శతాబ్దములోనే చోటుచేసికొన్నది. అయితే ప్రభువును ప్రేమించువారు భ్రష్టత్వమునకు విరోధముగా పోరాడవలసియున్నది. ప్రభువు బిడ్డలు తొట్రిల్లకుండ దేవుని కృపలో ఎదుగుచు పోరాడగల్గునట్లు వారి విశ్వాస ఓడకు లంగర్లు సూచింపబడెను. (1) అతి పరిశుద్ధమైన విశ్వాసముమీద కట్టుకొనుట. (2) పరిశుద్ధాత్మలో ప్రార్థించుట (3) ప్రభువు రాకడ కొరకు ఎదురుచూచుట (4) దేవుని ప్రేమలో నిలుచుట.

# ప్రకటన గ్రంథము

పరిశుద్ధ గ్రంథమును పరిసమాప్తముచేయు ప్రకటన గ్రంథమును “యేసు క్రీస్తుయొక్క ప్రత్యక్షత గ్రంథము” అనుట మిక్కిలి సమంజసము. ఇది గ్రీకులో Apokalupsis –“ముసుగు తీసివేయుట” అని అర్థము. ప్రకటన గ్రంథము మర్మములతో కూడి సులువుగా అర్థముకాదని అనేకులు తలంచెదరు. మర్మమును బట్టబయలు చేయునదియే ప్రకటన (ప్రత్యక్షత) గ్రంథము. దానియేలు గ్రంథమును

www.doctorpaul.org

గూర్చి "ఈ సంగతులు అంత్యకాలమువరకు మరుగుగా ఉండునట్లు ముద్రింపబడినవి" (12:9) అని వ్రాయబడెను. ప్రకటన విషయములో దానికి భిన్నముగా "ఈ గ్రంథమందున్న ప్రవచన వాక్యములకు ముద్ర వేయవలదు." (22:10) అని ఆజ్ఞాపించబడెను. పరిశుద్ధ గ్రంథముయొక్క ఆరంభ గ్రంథమునకు అంతిమ గ్రంథమును పోల్చి చూచినచో ఆసక్తికరమైనవి కనిపించును;

| ఆదికాండము | ప్రకటన గ్రంథము |
| --- | --- |
| భూమ్యాకాశములు సృజింపబడుట | భూమ్యాకాశములు గతించుట |
| పాపము, శాపము, మరణముల ప్రవేశము | ఈ మూడింటి నిర్మూలను |
| సాతాను చర్యల ప్రారంభము | సాతాను వాని చర్యలు కూలుట |
| జీవ వృక్షమునుండి నరుడు పారద్రోలబడుట | జీవవృక్షమునకు నరుడు తిరిగికొనిరాబడుట |
| అన్నిటి ఆరంభము | అన్నిటి సమాప్తము |

## ఈ గ్రంథముయొక్క ప్రధాన అంశము :

వర్తమాన భూత భవిష్యత్కాలములలో ఉన్న యేసుక్రీస్తు. దీని ఉద్దేశము ప్రభువైన యేసుక్రీస్తు యొక్క మహోన్నత మహిమను విశ్వాసికి కనబరచి ఆదరించుట. పత్మాసు ద్వీపమున చెరలో ఏకాకిగా నుండిన పరమర్థ జ్ఞాని యిట్లే ఆదరణ నొందెను. ఏడు అను సంఖ్య ఈ గ్రంథములో ప్రధాన భూమిక నిర్వహించును – ఏడు సంఘములు, ఏడు ముద్రలు, ఏడు బూరలు, ఏడు సూచనలు, ఏడు తెగుళ్లు, ఏడు పాత్రలు, ఏడు నూతన విషయములు మున్నగునవి.

## ప్రకటన గ్రంథములో మాత్రమే కనబడు ప్రభువుపేర్లు

| | | |
| --- | --- | --- |
| 1. | నమ్మకమైనసాక్షి, భూపతులకు అధిపతి | 1:5 |
| 2. | అల్ఫా మరియు ఓమెగ | 1:8 |
| 3. | మనుష్యకుమారుని పోలినవాడు | 1:13 |
| 4. | జీవించువాడు, మొదటివాడు–కడపటివాడు | 1:18 |
| 5. | ఏడు నక్షత్రములు పట్టుకొని.....సంచరించువాడు | 2:1 |

www.doctorpaul.org

| | | |
|---|---|---|
| 6. | మృతుడై మరల బ్రదికినవాడు | 2:13 |
| 7. | వాడియైన రెండంచులుగల ఖడ్గము గలవాడు | 2:13 |
| 8. | అగ్నిజ్వాలవంటి కన్నులు అపరంజినిపోలిన పాదములుగల దేవుని కుమారుడు | 2:18 |
| 9. | వేకువచుక్క | 2:28 |
| 10. | దేవుని యేడాత్మలునుగలవాడు | 3:1 |
| 11. | దావీదు తాళపు చెవి గలవాడు | 3:7 |
| 12. | ఆమెన్, నమ్మకమైన సత్యసాక్షి | 3:14 |
| 13. | యూదా గోత్రపు సింహము | 5:5 |
| 14. | దావీదుకు చిగురు | 5:5 |
| 15. | గొఱ్ఱెపిల్ల | 5:6 |
| 16. | దేవుని క్రీస్తు | 12:10 |
| 17. | మగ శిశువు | 12:13 |
| 18. | ప్రభువులకు ప్రభువు, రాజులకు రాజు | 17:14 |
| 19. | నమ్మకమైన సత్యవంతుడు | 19:11 |
| 20. | సింహాసనాసీనుడైయున్నవాడు | 5:13 |
| 21. | ఆదియు అంతమునై యున్నవాడు | 22:13 |
| 22. | యేసు అను నేను | 22:16 |
| 23. | ప్రకాశమానమైన వేకువచుక్క | 22:16 |

www.doctorpaul.org